


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం 19 జూన్ 2021 | సంపుటి : 02 | సంచిక :331 | పేజీలు : 4 | వెల : రూ 3-00


# ఫ్రంట్‌లైన్ వర్కర్లకు క్రాష్ కోర్సును ప్రారంభించిన మోదీ



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కోవిడ్ యోధులకు ప్రత్యేక శిక్షణ కోర్సును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించారు. కోవిడ్-19 ఫ్రంట్‌లైన్ వర్కర్ల నైపుణ్యాన్ని పెంచేందుకు ఈ కోర్సు దోహదపడుతుంది. మోదీ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా దాదాపు 1 లక్ష మంది ఫ్రంట్‌లైన్ వర్కర్లను తయారు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కరోనా వైరస్ తన రూపాన్ని నిరంతరం మార్చుకుంటుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వైరస్ తన రూపాలను మార్చుకుంటూ దేశానికి సవాలు విసురుతోందన్నారు. రూపం మారే కరోనా వైరస్ విసురుతున్న సవాళ్ళను మనం కోవిడ్-19 మహమ్మారి సెకండ్ వేవ్ సమయంలో గమనించామని చెప్పారు. ఈ వైరస్ రూపాలు మరింత మారే అవకాశం ఉందన్నారు. ఈ వైరస్‌తో పోరాడటం కోసం మరింత ఎక్కువగా సిద్ధమవాలని తెలిపారు. ఈ లక్ష్యంతోనే ఫ్రంట్‌లైన్ వర్కర్లకు దేశవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలను నేటి నుంచి (శుక్రవారం నుంచి) ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యకమాల ద్వారా దాదాపు ఒక లక్ష మంది ఫ్రంట్‌లైన్ వర్కర్లకు కస్టమైజ్డ్ క్రాష్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. హోం కేర్ సపోర్ట్, బేసిక్ కేర్ సపోర్ట్, అడ్వాన్స్‌డ్ కేర్ సపోర్ట్, ఎమర్జెన్సీ కేర్ సపోర్ట్, శాంపిల్ కలెక్షన్ సపోర్ట్, మెడికల్ ఎక్విప్‌మెంట్ సపోర్ట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసుపత్రులకు వెంటిలేటర్లు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 1500కు పైగా ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రక్రియ జరుగుతున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 3.0లో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనికోసం రూ.276 కోట్లు ఖర్చవుతుంది.

# జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన సీఎం జగన్



అమరావతి : ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. నిరుద్యోగులకు అండగా ఉండేలా మరిన్ని ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టారు. 2021-22 ఏడాదికి సంబంధించిన జాబ్ క్యాలెండర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. " దేవుని దయతో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ ప్రకటించాం. 2021-22 ఏడాదికి 10,143 ఉద్యోగాలు భర్తీ చేస్తాం. అత్యంత పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు ఉంటాయి. అవినీతి, వివక్షకు తావులేకుండా మెరిట్ ఆధారంగా ఉద్యోగాల భర్తీ జరుగుతుంది. అధికారంలోకి వచ్చిన 4 నెలల్లోపే లక్షకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశాం. ఒకేసారి లక్షకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా 2.50లక్షలకు పైగా నిరుద్యోగులను భాగస్వామ్యం చేశాం. ఏపీలో ఇప్పటివరకు 6,03,756 ఉద్యోగాలు భర్తీ చేశాం. దళారీ వ్యవస్థ లేకుండా ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. మినిమమ్ టైం స్కేల్‌తో కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు పెంచాం. 51,387 మంది ఆర్టీసీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాం. ప్రత్యేక హోదాపై కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే ఉన్నాం. ప్యాకేజీ, ఓటుకు కోట్లు కేసు కోసం చంద్రబాబు ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారు. గత ప్రభుత్వం మాటలతో భ్రమ కల్పించిన విషయం అందరికీ తెలుసు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా సంక్షేమం, అభివృద్ధి ఆగలేదు. ప్రభుత్వ ఆదాయం తగ్గినా సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నాం. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి. రైతులకు అండగా గ్రామాల్లో ఆర్బీకేలు నిలిచాయి. గ్రామాల్లో డిజిటల్ లైబ్రరీలను రాబోతున్నాయి. గ్రామాల అభివృద్ధి ఉద్యోగ విప్లవానికి నాంది పలుకుతుందివవ అని అన్నారు

# ప్రత్యేక హోదా కోసం ఒత్తిడి తెస్తూనే ఉన్నాం: సీఎం జగన్

## గత పాలకులు హోదాను తాకట్టు పెట్టారు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అమరావతి: ప్రత్యేక హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే ఉన్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 2021-22 ఏడాదికి సంబంధించిన జాబ్ క్యాలెండర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం మాట్లాడుతూ, ప్రత్యేక హోదా అంశాన్ని కూడా ప్రస్తావించారు. ప్యాకేజీ, ఓటుకు కోట్లు కేసు కోసం గత పాలకులు హోదాను తాకట్టు పెట్టారని సీఎం అన్నారు. గత ప్రభుత్వంలోని ఇద్దరు పెద్దలు కేంద్రమంత్రి పదవులు కూడా చేపట్టారని.. గత ప్రభుత్వం మాటలతో భ్రమ కల్పించిన విషయం అందరికీ తెలుసునని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రానికి మంచి జరుగుతుందని ఆశతో ఉన్నామని సీఎం వైఎస్ జగన్ అన్నారు.



# రఘురామ సభహక్కుల ఉల్లంఘన నోటీసుపై కదిలిన లోక్‌సభ సెక్రటేరియట్



న్యూఢిల్లీ: ఏపీ సీఎం, డీజీపీ ఇతర పోలీసు అధికారులపై ఎంపీ రఘురామకృష్ణంరాజు ఇచ్చిన సభా హక్కుల ఉల్లంఘన నోటీసుపై లోక్‌సభ సెక్రటేరియట్ స్పందించారు. వెంటనే సమగ్ర వివరాలు అందజేయాలని హోంశాఖ కార్యదర్శి అజయ్ బల్లాను కోరారు. జూన్ రెండో తేదీన రఘురామకృష్ణరాజు ఇచ్చిన సభా హక్కుల ఉల్లంఘన లేఖపై పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించారు. తనను అక్రమంగా అరెస్టు చేసి, కస్టోడియల్ టార్చర్‌కు గురిచేశారని లోక్‌సభ స్పీకర్‌కు ఎంపీ ఫిర్యాదు చేశారు. తన సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్, డీజీపీ, సీఐడీ ఏడీజీ, గుంటూరు అడిషనల్ ఎస్పీ విజయ్ పాల్‌పై ఎంపీ రఘురామ సభా హక్కుల ఉల్లంఘన ఫిర్యాదు చేశారు. రఘురామకృష్ణం రాజును కస్టోడియల్ టార్చర్‌కు గురి చేయడంపై ఆయన కుమారుడు భరత్, టీడీపీ ఎంపీలు రామ్మోహన్ నాయుడు కనకమేడల రవీంద్ర కుమార్‌ల లేఖలోని అంశాలపైన వివరాలు ఇవ్వాలని హోంశాఖను లోక్‌సభ సెక్రటేరియట్ కోరారు. 15 రోజుల్లోగా సమగ్ర నివేదికను హిందీ, ఇంగ్లీష్ కాపీలలో తమకు అందజేయాలని లోక్‌సభ సెక్రటేరియట్ ఆదేశించారు.

# అశోక్‌గజపతిరాజు జైలుకెళ్లడం తప్పదు: విజయసాయిరెడ్డి

విశాఖపట్నం: 'మాన్సాస్ ట్రస్ట్‌లో వందల ఎకరాలు కాజేసిన దొంగ అశోక్‌గజపతిరాజువ అంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అశోక్ గజపతిరాజుపై గతంలో ఫోర్జరీ కేసు కూడా ఉందని.. ఆయన జైలుకు వెళ్లడం తప్పదన్నారు. మాన్సాస్ ట్రస్ట్ తీర్పుపై అప్పీల్‌కు వెళ్తామని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. "భూకబ్జా వ్యవహారంలో టీడీపీ నేతలు తాత్కాలికంగా స్టే తెచ్చుకోగలిగారు. చేసిన తప్పులకు శిక్ష నుంచి మాత్రం తప్పుకోలేరు. ప్రభుత్వ భూములు ఆక్రమించినవారిని వదిలిపెట్టేది లేదనివవ ఎంపీ విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. కరోనా సమయంలో ఫ్రంట్ లైన్ వర్కర్లు ప్రాణాలకు తెగించి పనిచేశారని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఫ్రంట్ లైన్ వర్కర్లకు 'ఆనందయ్య మందువ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందయ్య మందు వల్ల ఎలాంటి ఇబ్బంది లేదని తేలిందని చెప్పారు. తొలి దశలో 22వేల మంది ఫ్రంట్ లైన్ వర్కర్లకు అందించామని పేర్కొన్నారు. దేశంలోనే లేని విధంగా ఏపీలో కోవిడ్ కట్టడికి సీఎం చర్యలు చేపట్టారని విజయసాయిరెడ్డి అన్నారు.



# ధూళిపాళ్ల బెయిల్ రద్దు కోరుతూ హైకోర్టులో ఏసీబీ పిటిషన్

అమరావతి: సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర బెయిల్ రద్దు కోరుతూ హైకోర్టులో ఏసీబీ పిటిషన్ దాఖలు చేసింది. నిబంధనలు ఉల్లంఘించారని ఏసీబీ వాదనలు వినిపించింది. ప్రతివాదులకు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 23కు హైకోర్టు వాయిదా వేసింది. ధూళిపాళ్ల నరేంద్ర, ఎండీ గోపాలకృష్ణన్‌లకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తు అధికారులు ఇప్పటికే అవసరమైన దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారని, పిటిషనర్లు కరోనా బారినపడి ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నందున బెయిల్ ఇస్తున్నట్లు పేర్కొంది. బెయిల్ నిమిత్తం విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషనర్లు ఇద్దరూ రూ.లక్ష చొప్పున రెండు పూచికత్తులు సమర్పించాలని ఆదేశించింది. బెయిల్‌పై విడుదలైన తేదీ నుంచి 4 వారాల పాటు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి దాటి బయటకు వెళ్లకూడదని స్పష్టం చేసింది. పిటిషనర్లు నివాసం ఉండే చిరునామాను ఏసీబీ అధికారులకు ఇవ్వాలని సూచించింది. దర్యాప్తులో భాగంగా పిటిషనర్లను విచారించాలని అధికారులు భావిస్తే 24 గంటల ముందు నోటీసులు జారీ చేయాలని స్పష్టంచేసింది.



# సింహం లాంటి వాళ్లం.. వదిలిపెట్టం... వేటాడుతాం: లోకేష్

కర్నూలు: జిల్లా పర్యటనకు వచ్చిన తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ వైసీపీ నేతల దాడిలో హత్యకు గురైన గడివేముల మండలం, పెసరవాయి గ్రామం టీడీపీ నేతలు ప్రతాప్ రెడ్డి, నాగేశ్వర రెడ్డిల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నేతలు ఇప్పటి వరకు 27 మంది టీడీపీ నేతలను అతి దారుణంగా చంపారన్నారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, బీసీ జనార్థన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ధూళిపాళ్ల నరేంద్ర తదితర నేతలపై అన్యాయంగా దొంగ కేసులు పెట్టి.. నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తే వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అన్నారు. 'అయ్యా మేము సింహం లాంటి వాళ్లం మిమ్మల్ని వదిలిపెట్టం వేటాడతామని' హెచ్చరించారు. మంచి పనులు చేయాలంటే అభివృద్ధి చేయాలని లోకేష్ సూచించారు. పరిశ్రమలు తీసుకువచ్చి, నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు.



# ఏపీలో కొత్తగా 6,341 కరోనా పాజిటివ్ కేసులు



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో కొత్తగా 6,341 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కాగా కొవిడ్-19తో 57 మంది చనిపోయారు. 8,486 మంది బాధితులు వ్యాధి నుంచి కోలుకున్నారు. తాజా కేసులతో కలుపుకుని ఏపీలో కరోనా కేసుల సంఖ్య 18,39,243కి చేరింది. వీటిలో యాక్టివ్ కేసుల సంఖ్య ప్రస్తుతం 67,629గా ఉంది. జిల్లాల వారీగా కొవిడ్-19 మరణాల వివరాలిలా ఉన్నాయి. చిత్తూరులో 12 మంది, గుంటూరులో 8 మంది, తూర్పుగోదావరిలో ఆరుగురు, కృష్ణా, ప్రకాశం, శ్రీకాకుళంలో ఐదుగురు చొప్పున, అనంతపురం, నెల్లూరు, విశాఖపట్నం, పశ్చిమ గోదావరిలో ముగ్గురు చొప్పున, కర్నూలు, విజయనగరంలో ఇద్దరు చొప్పున మరణించారు.

# విద్యాశాఖలో 2,397 పోస్టుల భర్తీ: ఆదిమూలపు



అమరావతి: రాష్ట్రంలో 2021-22కు విడుదల చేసిన మొత్తం 10,143 ఉద్యోగాల్లో విద్యాశాఖకు చెందిన 2,397 పోస్టులు భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక, ఉన్నత విద్యలో భర్తీ చేయనున్న ఈ పోస్టులు అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకతతో కేవలం మెరిట్ ఆధారంగా రాత పరీక్షతో ఎంపిక చేయనున్నామని తెలిపారు. 2019 జూన్ నుంచి ఇప్పటికి విద్యాశాఖలో 5,812 ఉద్యోగాలు భర్తీ చేసినట్టు మంత్రి తెలిపారు. ఇప్పుడు 2021-22 లో మొత్తం 1238 బ్యాక్ లాగ్ పోస్టుల్లో విద్యాశాఖ నుంచి 157 పోస్టులు ఉన్నాయి. అందులో అత్యధికంగా జూనియర్ లెక్చరర్ పోస్టులు 54 ఉన్నాయి. మొత్తం 157 పోస్టుల్లో 92 ఎస్సీ, 65 ఎస్టీ కేటగిరికి చెందినవని మంత్రి తెలిపారు. ఈ పోస్టులకు జూలై 2021లో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు చెప్పారు. డిగ్రీ కళాశాలల్లో 240 లెక్చరర్ పోస్టుల భర్తీ చేయనుండగా జనవరి 2022లో వీటికి నోటిఫికేషన్ ఇస్తామని తెలిపారు. యూనివర్సిటీల్లో 2000 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 2022లో నోటిఫికేషన్ విడుదల చేస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నిరుద్యోగులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా అవకాశాలు కల్పించటం జరుగుతుందని, దళారులు, లంచగొండితనం లేకుండా మెరిట్ మీదనే ఉద్యోగాలు దక్కటంతో అందరూ జగనన్నను అభినందిస్తున్నారని మంత్రి సురేష్ అన్నారు.

# మహమ్మారిని తేలికగా తీసుకోవద్దు : డాక్టర్ హర్షవర్ధన్

న్యూఢిల్లీ : కరోనా వ్యాక్సిన్ వచ్చిన తర్వాత ప్రజలు కొవిడ్-19 నిబంధనలను పాటించడంలో అలసత్వం ప్రదర్శిస్తూ మహమ్మారిని తేలికగా తీసుకుంటున్నారని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. ప్రజలు కొవిడ్-19 ప్రొటోకాల్ ను విధిగా పాటించాలని, మాస్క్ లు ధరిస్తూ, భౌతిక దూరం నిబంధనలను పాటించాలని కోరారు. అన్ లాక్ ప్రక్రియ ప్రారంభమైనా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మనమందరం అప్రమత్తంగా ఉంటూ కరోనా కట్టడికి అన్ని చర్యలూ చేపడితేనే మహమ్మారి అంతమవుతుందని డాక్టర్ హర్షవర్ధన్ ట్వీట్ చేశారు. మనం ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా కరోనా నిబంధనలను పాటించాలని, అందరూ త్వరగా వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆయన ట్వీట్ చేశారు.



# సంపాదకీయం

శనివారం 19 జూన్ 2021

## నాలుగు రాష్ట్రాలుగా యూపీ

భారతీయ జనతాపార్టీ గుండెల్లో గుబులు పుట్టిస్తోంది ఉత్తరప్రదేశ్. 2022 మొదట్లో జరిగే శాసనసభ ఎన్నికలపైనే 2024 లోక్ సభ ఎన్నికలూ ఆధారపడి ఉంటాయని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. కే?ంద్రంలో బీజేపీ సుస్థిరపాలనకు ఉత్తరప్రదేశ్ ఊతమిస్తోంది. ఈ రాష్ట్రంలో లభించిన మెజార్టీనే దేశంలో బీజేపీని తిరుగులేని శక్తి గా మార్చింది. ఇప్పుడు అక్కడ పరిస్థితులు ప్రతికూలంగా మారాయి. ఒకవేళ ఉత్తరప్రదేశ్ లో ఓటమి పాలైతే ఆ తర్వాత రెండేళ్లు కేంద్రంలో కూడా పరిపాలన సజావుగా సాగదు. అస్థిరత ఏర్పడుతుంది. ప్రతిపక్షాలు పుంజుకుంటాయి. ఆ భయమే ఇప్పుడు బీజేపీని వణికిస్తోంది. ఇటీవలి ఎన్నికలన్నిటిలోనూ విపక్షాలు పైచేయి సాధించాయి. అందుకే ప్రత్యామ్నాయ ప్రణాళికతో తన ఆధిక్యాన్ని కాపాడుకోవడంపై అధినాయకత్వం దృష్టి సారించింది. దేశంలోనే పెద్ద రాష్ట్రమైన యూపీని నాలుగు రాష్ట్రాలుగా చేయాలని ఎప్పుడో బీఎస్పీ అధినేత్రి మాయావతి డిమాండ్ చేశారు. ఆ ప్రతిపాదన దుమ్ము దులిపి విధంగా బీజేపీ పావులు కదుపుతోందనేది రాజకీయ వర్గాల సమాచారం. అదే జరిగితే దేశ చిత్రపటంలో మరికొన్ని రాష్ట్రాలు చేరతాయి.రామాలయ నిర్మాణం, జమ్మూ కశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దు , పౌరసత్వ సవరణలు వంటి అంశాలన్నీ ప్రజల దృష్టిలో పాతబడి పోయాయి. కొత్తగా బీజేపీకి ఓట్లు తెచ్చి పెట్టే అజెండా కరవు అయ్యింది. ప్రజలను భావోద్వేగాలకు గురి చేసి మూకుమ్మడిగా తమ వైపు మలచుకునేందుకు కొత్త అంశం ఒక్కటి కూడా కనిపించడం లేదు. ఫలితంగానే తాజాగా ఉత్తరప్రదేశ్ లో జరిగిన పంచాయతీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాజయం చవి చూసింది. రాష్ట రాజధాని లక్నో, ప్రధాని ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాశి, ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న గోరఖ్ పూర్ వంటి ప్రాంతాలన్నిటా చేదు ఫలితాలే ఎదురయ్యాయి. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న పార్టీ ఇలా చతికిలపడటం అనూహ్యమైన పరిణామం. అంతే కాదు , రాష్ట్రంలో పార్టీ భవిష్యత్తుకు సంకేతం. పైపెచ్చు అయోధ్య రామాలయ నిర్మాణానికి సంబంధించిన రామజన్మభూమి తీర్థ ట్రస్టు ఇటీవల కొన్ని ఆరోపణలనూ ఎదుర్కొంటోంది. భూముల కొనుగోలులో అవినీతి జరిగిందని సమాజ్ వాదీ పార్టీ ఆరోపిస్తోంది. ఇది తమ ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు తెస్తుందేమోనన్న భయం మరోవైపు వెంటాడుతోంది. ఉత్తరప్రదేశ్ ను వివిధ మతాలు, కులాల సంకుల సమరంగానే చూడాలి. ఇక్కడ పార్టీలు కూడా ఎక్కువే. బీజేపీ, సమాజ్ వాదీ, బహుజనసమాజ్, కాంగ్రెసు పెద్ద పార్టీలుగా చెప్పుకోవాలి. ఆర్ ఎల్ డీ, అప్నాదళ్ వంటి ఉపప్రాంతీయ పార్టీలకూ కొదవ లేదు. ఎక్కువ పార్టీలు పోటీలో ఉంటే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోయి బీజేపీకి కలిసి వస్తుందని నిన్నామొన్నటి వరకూ నాయకత్వం ఆశలు పెట్టుకుంది. తాజా గా జరిగిన లోకల్ బాడీల ఎన్నికలు, పరిణామాలు ఆ ఆశలను నీరు గారుస్తున్నాయి. బహుజన సమాజ్ పార్టీ అంతర్గత విభేదాలతో పూర్తిగా బలహీనపడిపోయింది. కాంగ్రెసు పార్టీ చేతివేళ్లపై లెక్కించదగిన సీట్లలోనూ పోటీ చేయగల సామర్థ్యం ఉంది. సమాజ్ వాదీ పార్టీ దూకుడు బాగా పెరిగింది. బీజేపీతో ముఖాముఖి పోటీ పడితే పైచేయి సాధించే సామర్థ్యం ఎస్పీకి ఉంది. గతంలోనే ముఖ్యమంత్రిగా పనిచేసిన అఖిలేష్ నాయకత్వమూ ఆ పార్టీకి అసెట్. దార్శనికునిగా మధ్యతరగతి వర్గాల్లో అఖిలేష్ కు మంచి పేరుంది. ప్రతిపక్షాల ఓట్ల చీలిక గణనీయంగా లేకపోతే బీజేపీ ప్రభుత్వానికి చిక్కులు తప్పకపోవచ్చు. ఉత్తర ప్రదేశ్ చిన్నాచితక రాష్ట్రం కాదు. దేశంలో ఎన్ని భిన్న రకాల సంస్కృతులు , సంప్రదాయాలు ఉన్నాయో అంతకుమించిన వైవిధ్యం యూపీలో కనిపిస్తుంది. ప్రపంచంలోని అనేక దేశాల కంటే పెద్ద రాష్ట్రం ఇది. కేవలం చైనా, అమెరికా, ఇండోనేషియా, బ్రెజిల్ మాత్రమే బారత్ లోని యూపీ కంటే పెద్ద దేశాలు. మన తెలుగు రాష్ట్రాల్లో ఏపీ కంటే నాలుగు రెట్లు పెద్దది. తెలంగాణ కంటే ఆరు రెట్లు పెద్ద రాష్ట్రం. దీనిని మూడు నాలుగు రాష్ట్రాలుగా విభజిస్తే సమాజ్ వాదీ, బీఎస్పీ వంటి పార్టీల ప్రాబల్యాన్ని కొంత ప్రాంతానికే పరిమితం చేయవచ్చనేది ఒక ఆలోచన. రాష్ట్రాల విభజన తర్వాత ప్రాంతీయ పార్టీలు అధినేతల సొంత ప్రాంతానికే కాలక్రమంలో పరిమితమవుతాయి. తెలుగుదేశం, వైసీపీలు ఆంధ్రప్రదేశ్ కు కుదించుకుపోయిన ఉదాహరణే ఇందుకు నిదర్శనం. కానీ జాతీయ పార్టీలకు ఈ సమస్య ఉండదు. ఎలాగూ కాంగ్రెసు పార్టీ యూపీలో అన్ని ప్రాంతాల్లోనూ దెబ్బతింది. అందువల్ల బీజేపీకి ఆ పార్టీ పెద్ద పోటీనిచ్చే పరిస్థితి లేదు. సమాజ్ వాదీని కూడా ఒక ప్రాంతానికి పరిమితం చేస్తే శాశ్వతంగా దేశ చిత్రపటంలో బీజేపీ ఆధిక్యాన్ని స్థిరపరచుకోవచ్చనేది దీర్ఘకాలిక ప్రణాళికగా చెబుతున్నారు. వచ్చే ఆరేడు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎలా బయటపడాలనేది తక్షణ సమస్య. ఈ లోపుగా రాష్ట్ర విభజన వంటి సంక్లిష్ట సమస్య సాకారమవుతుందా? అంటే సందేహమే.

# నిమ్మగడ్డకు మరోసారి నోటీసులు



విజయవాడ, జూన్ 18, (న్యూస్ పల్స్)రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ పై ప్రభుత్వం మరోసారి కేసులు తిరగదోడాలని నిర్ణయించుకుంది. ఇప్పటికే ఆయనపై ప్రివిలేజ్ కమిటీలో సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ఉంది. గతంలోనే ఆయనకు ప్రివిలేజ్ కమిటీ నోటీసులు జారీ చేసింది. అయితే కరోనా తీవ్రత కారణంగా ఇప్పటి వరకూ నిమ్మగడ్డ రమేష్ కుమార్ విషయాన్ని పక్కన పెట్టారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కరోనా తీవ్రత తగ్గిన వెంటనే ప్రివిలేజ్ కమిటీ తిరిగి నోటీసులు జారీ చేసే అవకాశముంది. నిమ్మగడ్డ రమేష్ కుమార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రభుత్వానికి నామమాత్రంగానైనా తెలియ చేయకుండానే ఆయన నిర్ణయం తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీ చెప్పినట్లే నిమ్మగడ్డ రమేష్ కుమార్ నడుచుకున్నారని అప్పట్లో వైసీపీ నేతలు కూడా ఆరోపించారు. అంతటితో ఆగకుండా నిమ్మగడ్డ రమేష్ కుమార్ హోంశాఖకు లేఖ రాయడం కూడా వివాదాస్పదమయింది. హోంశాఖకు రాసిన లేఖలో నిమ్మగడ్డ రమేష్ కుమార్ జగన్ ను ఫ్యాక్షనిస్టుగా చిత్రీకరించడాన్ని కూడా వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆ లేఖ వెనక తెలుగుదేశం పార్టీ పెద్దలు ఉన్నారని వైసీపీ అభిప్రాయపడుతుంది. దీనిపై సీఐడీ దర్యాప్తునకు కూడా అప్పట్లో ప్రభుత్వం ఆదేశించింది. దాదాపు ఏడాదిన్నర కాలం నిమ్మగడ్డ రమేష్ కుమార్ ప్రభుత్వాన్ని ముప్పు తిప్పలు పెట్టారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫలితాల పరంగా కాకున్నా మానసికంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీంతోనే ఇటీవల వైసీపీ ముఖ్యనేత ఒకరు నిమ్మగడ్డ రమేష్ కుమార్ విషయంలో ప్రివిలేజ్ కమిటీలో కేసు పురోగతిని స్వయంగా పరిశీలించినట్లు తెలిసింది. ఆయన మరోసారి నిమ్మగడ్డకు నోటీసులు పంపాలని అధికారులను కోరినట్లు తెలిసింది. నిమ్మగడ్డ రమేష్ కుమార్ పదవీ విరమణ చేసి హైదరాబాద్ లోనే ఉంటున్నారు. అయితే కరోనా తీవ్రత కొంత తగ్గుముఖం పట్టిన తర్వాత నిమ్మగడ్డ రమేష్ కుమార్ కు ప్రివిలేజ్ కమిటీ నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది.

# జగన్ వారసురాలిగా భారతి



విజయవాడ, జూన్ 18, (న్యూస్ పల్స్)జగన్ ఎక్కువగా మాట్లాడరు, ఆయన గురించి తెలుసుకోవాలని జనాలకు ఉన్నా అసలు వీలు పడదు, ఇక జగన్ కుటుంబపరమైన విషయాలు కూడా తెలిసే అవకాశాలు చాలా తక్కువ. అయితే జగన్ సీఎం అయ్యాక మాత్రం సతీమణి భారతిని వెంటబెట్టుకుని వరసగా కొన్ని కార్యక్రమాలను హాజరవుతున్నారు. ఈ మధ్యన జగన్ వ్యాక్సిన్ వేసుకున్నపుడు భార్యాసమేతంగానే వచ్చారు. ఇక రీసెంట్ గా ఆయన గవర్నర్ తో భేటీ అయ్యే సమయంలో కూడా పక్కన భారతి ఉన్నారు. జగన్ గవర్నర్ ని కలవడం అన్నది అధికారిక కార్యక్రమం. భార్య పక్కన ఉండడం తప్పు కాదు కానీ ఆమెని వెంటబెట్టుకుని రావడమే ఈ సందర్భంగా మీడియాలో పెద్ద ఎత్తున హైలెట్ అయింది. జగన్ మీద వచ్చినన్ని పుకార్లు, ఊహాగానాలు మరే రాజకీయ నేత మీద ఈ మధ్యకాలంలో రాలేదు అంటే నిజం. జగన్ పన్నెండేళ్ల రాజకీయంలో వాస్తవాల కంటే కూడా ఊహాగానాలే ఎక్కువగా జనాలకు చేరిపోయాయి. లక్ష కోట్ల అవినీతి, జగన్ కాంగ్రెస్ తో కుమ్మక్కు అయి బెయిల్ మీద బయటకు వచ్చాడు. జగన్ బీజేపీతో దోస్తీ వెనక సీబీఐ కేసుల భయం ఉంది. జగన్ మళ్ళీ జైలుకు వెళ్తాడు ఇలా రకరకాలుగా ప్రత్యర్థులు ఈ రోజుకీ ప్రచారం చేస్తూనే ఉన్నారు. ఈ సమయంలోనే ఇంకో వార్త కూడా ఇపుడు విపరీతంగా వైరల్ అవుతోంది. జగన్ బెయిల్ రద్దు అయి జైలుకు వెళ్తే భారతి తదుపరి ముఖ్యమంత్రి అవుతారన్నదే ఆ వార్త. జగన్ తన సతీమణికి రాజకీయాలతో పాటు పాలనాపరమైన వ్యవహారాలలో ట్రైనింగ్ ఇప్పిస్తున్నారు అంటూ కూడా పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఒకవేళ అనూహ్యమైన పరిణామాలు సంభవించి తాను జైలుకు వెళ్తే సతీమణి భారతి గద్దె మీద కూర్చోవడానికి అంతా సిద్ధం చేసి ఉంచారని కూడా అంటున్నారు. ఇక జగన్ కి అత్యంత సన్నిహితుడు సజ్జల రామకృష్ణారెడ్డి భారతికి బంధువు కావడంతో ఆయన వ్యూహాలు కూడా భారతి సీఎం కావడానికి, ఆ మీదట నిలదొక్కుకోవడానికి ఉపయోగపడతాయని అంటున్నారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కి తన సతీమణిని జగన్ పరిచయం చేశారని, తనకు ఏమైనా కోర్టు ఇబ్బందులు ఉంటే తరువాత సీఎం గా ఆమెకే అవకాశం ఇవ్వాలని జగన్ కోరారని కూడా ప్రచారం అయితే సాగుతోంది. నిజంగా ఇవి నమ్మదగినవిగా లేకపోయినా ఆసక్తికరంగా ఉన్నాయి. జగన్ అధికారంలోకి రాకముందు ఎక్కడా భారతి కనిపించలేదు. ఇక ఆయన సీఎం అయ్యాక మాత్రం ఎక్కువగానే దర్శనమిస్తున్నారు. దానికి తోడు సొంత చెల్లెలు షర్మిల తెలంగాణాలో తన రాజకీయ భవిష్యత్తుని వెతుక్కుంటోంది. తల్లి విజయమ్మకు వయోభారంతో పాటు రాజకీయ ఆసక్తి కూడా లేదు. దాంతో జగన్ వారసులు ఎవరు అంటే కచ్చితంగా భారతినే ఎవరైనా చెబుతారు. జగన్ ఇంట్లోనే రాజకీయం ఉంది. దశాబ్దాలుగా వైఎస్ కుటుంబంలో ఉంటున్న భారతికి రాజకీయాలు వంటబట్టకుండా ఉండవు అంటే ఎవరైనా నమ్మగలరా. ఇక జగన్ సతీమణిగా, సగభాగంగా ఆయన పాలనలో, రాజకీయాలలో ఆమె పాత్ర లేకుండా ఉంటుందా. మొత్తానికి జగన్ని ప్రత్యర్థులు టార్గెట్ చేస్తూనే భారతి మీద కూడా ఫోకస్ పెడుతున్నారు. మరి ఈ ఊహాగానాలు నిజమవుతాయా. జగన్ ని మళ్ళీ జైలుకు పంపేటంత సీన్ ఉంటుందా. చూడాల్సిందే

# వైసీపీలో అపరి-చితులు



నెల్లూరు, జూన్ 18, (న్యూస్ పల్స్)సొంత పార్టీకే వారు అపరిచితులుగా మారిపోయారా. వారికి పార్టీకి మధ్య అతి పెద్ద గ్యాప్ ఏర్పడిందా. ఎన్నికల్లో టికెట్ తీసుకోవడం గెలవడం వరకే వారు పరిమితం అయిపోయారా. వైసీపీ సర్కార్ బంపర్ విక్టరీని అందించిన 151 నంబర్ లోనే వారిని చూసుకోవాల్సిందేనా. ఇదంతా వైసీపీలోని మెజారిటీ ఎమ్మెల్యేల ఆవేదన. వారిలో రోజురోజుకూ పెరిగిపోతున్న నిరాశకు ఇది దర్పణంగా చూడాలి. తాము పేరుకు మాత్రమే ఎమ్మెల్యేలమని, తమ నియోజకవర్గంలో జనాలకూ అక్కరలేదు. అటు జగన్ కీ పట్టడంలేదని మదనపడుతున్నారుట. ఈ మధ్య ఎందుకో వైసీపీ పెద్దలు తన పార్టీలో యాక్టివ్ గా ఉండే ఎమ్మెల్యేలు ఎవరు, ఎంపీలు ఎవరు అన్న దాని మీద చిన్నపాటి సర్వేని ఒకదాన్ని నిర్వహించారుట. అయితే అందుకో చాలా ఆశ్చర్యకరమైన విషయాలే వెలుగు చూశాయట. ఎంపీలు, ఎమ్మెల్యేలలో మెజారిటీ అసంతృప్తిగా ఉంటున్నారుట. తమకు ఏ రకమైన అధికారాలు లేవని, జనాలు కూడా అసలు గుర్తించడం లేదని, తాము చేసేందుకు ఏమీ లేదని కూడా భావిస్తున్నారుట. వైసీపీ అధినాయకత్వం కూడా తమను ఏ మాత్రం పట్టించుకోవడంలేదు అన్న బాధ కూడా వారిలో ఉందిట. ఇక ఎమ్మెల్యే అంటేనే ఒక అందం. అది కూడా అధికార పార్టీలో ఉంటే ఆ కిక్కే వేరు, లెక్కే వేరు. కానీ జగన్ జమానాలో ఎమ్మెల్యేలకు ఏ మాత్రం విలువ లేదని అర్థమైపోయిందట. అటు జగన్, ఇటు జగం మధ్యలో ఎవరూ లేరు. అలా జగన్ డైరెక్ట్ గా కనెక్ట్ అయిపోయారు. ఇక వారికి అనుసంధానంగా వాలంటీర్లు ఎటూ ఉన్నారు. దాంతో వైసీపీ ఎమ్మెల్యేలు ఎవరు అన్నది కూడా జనాలకు అవసరం లేకపోతోంది. వారికి పవర్స్ కూడా లేవు అని జనాలకు తెలిసిపోయిందిట. దాంతో మీ ఎమ్మెల్యే ఎవరు అంటే ఏ ఒక్క నియోజకవర్గంలో జనాలు ఠక్కున చెప్పే సీన్ అన్నదే లేదుట. అలా తమ సొంత పార్టీకి నియోజ్కవర్గానికి ఎమ్మెల్యేలు అపరిచితులుగా మారిపోయారుట. కోట్లు ఖర్చు పెట్టి ఎమ్మెల్యేలు అయ్యారు. మరి రెండేళ్ల పాలన గడచింది ఏమి బావుకున్నామని వారంతా బావురుమంటున్నారుట. ఇటు జనంలో గుర్తింపు లేక అటు అధినాయకత్వం వద్ద కూడా పలుకుబడి లేక రెండింటికీ చెడిపోయామని కూడా ఫీల్ అవుతున్నారుట. అప్పులు చేసి ఎమ్మెల్యే గిరీ తెచ్చుకుంటే వాటి వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితి ఇపుడు ఉందని వారు ఆవేదన చెందుతున్నారు. దాంతో తమ వ్యాపారాన్ని నమ్ముకోవడమే బెటర్ అని చాలా మంది ఉన్న చోట ఉండకుండా హైదరాబాద్, బెంగుళూరు,చెన్నై ఇలా బిజినెస్ పేరిట బిజీ అయిపోయారుట. ఈ సర్వే చూసి వైసీపీ అధినాయకత్వం సైతం ఖంగు తింటోందిట. ఎమ్మెల్యేలు లేకుండా జగన్ ని చూసి ఓటేసినా కూడా వచ్చే ఎన్నికల్లో గెలవాలంటే ఎంతో కొంత తెలిసిన ముఖంగా ఎమ్మెల్యేలు ఉండాలిగా అన్న భావన హై కమాండ్ కి ఉందిట. మరి కరోనా తగ్గాక ఎమ్మెల్యేలతో మీటింగ్ ఏదైనా నిర్వహించాలన్న ఆలోచనలో వైసీపీ పెద్దలు ఉన్నారని టాక్.

# టీడీపీని భయపెడుతున్న సెంటిమెంట్

గుంటూరు, జూన్ 18, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ను ఆ సెంటిమెంట్ భయపెడుతుందా? అంటే అవుననే అంటున్నారు. వరసగా రెండు సార్లు ఓటమి ఆయనకు సెంటిమెంట్ గా వస్తుంది. దీంతో 2024 ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్నది చంద్రబాబులో కలవరం మొదలయింది. పైగా జగన్ సంక్షేమ పథకాలతో ప్రజలను తన వైపునకు తిప్పుకుంటున్నారు. కులాల వారీగా ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. 1999లో విజయం సాధించిన తర్వాత చంద్రబాబు పదేళ్ల పాటు ప్రతిపక్షంలోనే ఉండి పోవాల్సి వచ్చింది. అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2004, 2009 ఎన్నికల్లో విజయం సాధించింది. చంద్రబాబు ఎన్ని కూటములు ఏర్పాటు చేసినా ఫలితం దక్కలేదు. అయితే అది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో. పదేళ్ల తర్వాత 2014లో చంద్రబాబుకు విభజన జరిగిన ఏపీలో మళ్లీ అధికారం దక్కింది. మరోసారి పదేళ్ల పాటు చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండక తప్పదన్న సెంటిమెంట్ పార్టీ నేతలను పట్టి పీడిస్తుంది. ఈసారి అధికారంలోకి రాలేకపోతే పార్టీ మరింత ఇబ్బందుల్లో పడే అవకాశముంది. రెండేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అనేక ఇబ్బందులను టీడీపీ ఎదుర్కొంటుంది. కేసులతోనే కాకుండా ఆర్థిక ఇబ్బందులను కూడా ఎదుర్కొనడటంతో నేతలు పార్టీకి దూరంగా ఉంటున్నారు. దీంతో చంద్రబాబు సెంటిమెంట్ రిపీట్ కాకుండా ఉండాలని శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా కూటమిని ఏర్పాటు చేసి విజయం సాధించాలన్నది చంద్రబాబు లక్ష్యంగా ఉంది. అందుకోసమే ఇప్పటి నుంచే ఆయన పావులు కదుపుతున్నారు. బీజేపీ, జనసేనలతో కలసి వెళితేనే తనకు మరోసారి విజయం ఖాయమని చంద్రబాబు భావిస్తున్నారు. కూటమి ఏర్పాటయితే మిత్రపక్షాలకు ఇవ్వాల్సిన సీట్ల విషయంలో కూడా ఇప్పటి నుంచే ఆయన జాబితాను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

# పుంజుకుంటున్న పరిటాల

అనంతపురం, జూన్ 18, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీలో నేతలంతా దాదాపు సైలెంట్ అయిపోయారు. ముఖ్యంగా రాయలసీమలో అనేక మంది సీనియర్ నేతలున్నా ఎవరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. జేసీ బ్రదర్స్ కూడా ఇటీవల కాలంలో సైలెంట్ అయిపోయారు. అయితే పరిటాల ఫ్యామిలీ మాత్రం ఫుల్లు యాక్టివ్ కావడం విశేషం. రాప్తాడు నియోజకవర్గంలో తిరిగి విజయం దక్కించుకునేందుకు పరిటాల సునీత గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. రాప్తాడు నియోజకవర్గం పరిటాల ఫ్యామిలీకి పట్టున్న నియోజకవర్గం. పరిటాల రవి అభిమానులు మెండుగా ఉన్న ప్రాంతంలో గత ఎన్నికల్లో ఓటమి పాలు కావాల్సి వచ్చింది. పరిటాల సునీత పోటీకి దూరంగా ఉండటమే ఓటమి గల కారణాలన్న విశ్లేషణలు ఫలితాల అనంతరం విన్పించాయి. గత ఎన్నికల్లో రాప్తాడు నుంచి పరిటాల శ్రీరామ్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దీంతో ఈసారి రాప్తాడు నుంచి పరిటాల సునీత పోటీ చేయాలని భావిస్తున్నారు. అందుకోసం ఇప్పటి నుంచే ఆమె క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. రాప్తాడు ప్రస్తుత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పైన అవకాశం వచ్చినప్పుడల్లా విరుచుకుపడుతున్నారు. ఆయన అవినీతిని ప్రశ్నిస్తున్నారు. పరిటాల సునీత, శ్రీరామ్ లు ఇద్దరూ ఇప్పుడు రాప్తాడుపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. నిత్యం కార్యకర్తలతో సమావేశమవుతూ వారిలో ధైర్యాన్ని నింపుతున్నారు. పరిటాల శ్రీరామ్ పై వరసగా నమోదవుతున్న కేసులు కూడా తమకు అనుకూలంగా మారతాయన్న భావనలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు కూడా రాప్తాడులోనే ఎక్కువగా సక్సెస్ అవుతున్నాయి. పరిటాల సునీత సయితం నియోజకవర్గంలో ప్రతి ఇంట్లో జరిగే కార్యక్రమాలకు స్వయంగా హాజరవుతున్నారు. పరిటాల సునీత పట్ల కొంత సానుభూతి ఇప్పటికీ ఉంది. ఆమె అయితేనే వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తుందన్న భావన చంద్రబాబులోనూ ఉంది. దీంతో పరిటాల సునీతను రాప్తాడులో యాక్టివ్ కావాలని చెప్పడంతోనే ఆమె క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద తమ కంచుకోటను కాపాడుకోవడానికి పరిటాల సునీత విశ్వప్రయత్నం చేస్తున్నారు. మరి ఏంజరుగుతుందో చూడాలి.

# రఘురామకు మంత్రి పదవి...

న్యూఢిల్లీ, జూన్ 18, (న్యూస్ పల్స్)గుదేశం ప్రభుత్వంలో ఏపీ నుంచి కేంద్ర మంత్రులు ఉండేవారు. బీజేపీ టీడీపీ మిత్రులు కావడంతో పూసపాటి అశోక్ గజపతిరాజుతో పాటు, సుజనా చౌదరికి కేంద్ర మంత్రుల యోగం పట్టింది. ఇక ఏపీ నుంచి రాజ్యసభకు నెగ్గిన సురేష్ ప్రభు, నిర్మలా సీతారామన్ కూడా ఇక్కడి కోటాగానే పరిగణించేవారు. మొత్తానికి నాడు కేంద్రంతో మాటా మంత్రి జరపడానికి నేరుగా కేంద్ర మంత్రులు ఉండేవారు. ఫలితాలు పర్యవసానాలు పక్కన పెడితే ఒక లింక్ అంటూ ఉండేది. ఇపుడు చూస్తే రెండేళ్ళు గడచినా కూడా ఏపీ నుంచి ప్రాతినిధ్యమే లేదు. పొరుగున ఉన్న తెలంగాణా తీసుకుంటే కిషన్ రెడ్డి హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. మరో విడత విస్తరణలో ఇంకో పదవి కూడా తెలంగాణాకు ఇస్తారని కూడా అంటున్నారు. మొత్తానికి అక్కడ బీజేపీకి నలుగురు లోక్ సభ ఎంపీలు ఉన్నారు కాబట్టి కేంద్ర మంత్రులు కూడా వచ్చారు. ఏపీలో చూస్తే మరి కొద్ది నెలల్లో టీడీపీ నుంచి బీజేపీలోకి జంప్ చేసిన రాజ్య సభ సభ్యులు కూడా పదవీ విరమణ చేస్తారు. దాంతో ఏపీ నుంచి బీజేపీకి ఒక్క ఎంపీ కూడా ఉన్నారని చెప్పుకోవడానికి కూడా ఉండదు. ఇక ప్రకాశం జిల్లాకు చెందిన జీవీఎల్ నరసింహారావు వేరే రాష్ట్రం నుంచి రాజ్యసభకు నెగ్గారు. ఆయనకు కేంద్ర మంత్రి పదవి ఇచ్చినా కొంతలో కొంత నయమే కానీ ఆయనకు కులమే మైనస్ గా ఉందని అంటున్నారు. ఏపీలో బీజేపీకి ఒక్క ఎంపీ లేరని మధనపడకుండా ఒకే ఒక్కడు అన్నట్లుగా నర్సాపురం వైసీపీ రెబెల్ ఎంపీ రఘురామ క్రిష్ణంరాజు ఉన్నారు. ఆయన గెలిచిన తరువాత నుంచి బీజేపీకి అనధికార ఎంపీగానే ఉంటూ వస్తున్నారు. ఆయనకు నేరుగా కేంద్ర మంత్రులతో అపాయింట్లుమెంట్లు కూడా దక్కుతున్నాయి. ఏపీలో వైసీపీని ఇబ్బంది పెడుతూ ఈ ఎంపీ ఉంటే ఆయన్ని బీజేపీ వెనకేసుకువస్తోందన్న ప్రచారం ఉంది. ఇదంతా అందరికీ తెలిసిన రాజకీయమే అయినపుడు ఈ ముసుగులో గుద్దులాట ఎందుకు. ఆయనకే రేపు కేంద్ర మంత్రి పదవి ఇచ్చేస్తే పోలా అన్న చర్చ కూడా ఉంది. ఏపీలో 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను లాగేసుకుని అందులో నలుగురుని మంత్రులుగా చంద్రబాబు చేయగా లేనిది రాజుకి బీజేపీ కేంద్ర మంత్రి పదవి ఇస్తే తప్పేముంది. పైగా బీజేపీ మార్క్ రాజకీయాలు కూడా ఇలాగే ఉంటాయి కాదా అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఏమో ఇవాళ రాజు గా ఢిల్లీలో అదరగొడుతున్న రఘురామ రేపు మంత్రిగా అవతరించినా ఆశ్చర్యం లేదు అన్న మాట కూడా ఉంది. జస్ట్ వెయిట్ అండ్ సీ. అంతే.

# రూటు మార్చిన ఎర్రచందనం స్మగ్లర్లు

కడప, జూన్ 18, (న్యూస్ పల్స్)ప్రపంచంలోనే అరుదైన ఎర్రచందనం జిల్లాలోని అటవీ ప్రాంతంలో లభ్యమవుతోంది. దీన్ని అక్రమంగా నరికి, రవాణా చేసేందుకు తమిళ స్మగ్లర్లు, కూలీలు ఎప్పటికప్పుడు రూటు మారుస్తూ, తెగబడుతున్నారు. గతంలో చెన్నై నుంచి జిల్లాలోకి ప్రవేశించే వారు. పోలీసు, అటవీ శాఖ అధికారుల నిరంతర కూంబింగ్‌తో కొంత రూటు మార్చా రు. తిరుపతి, రైల్వేకోడూరు, రాజంపేట, బాలుపల్లి, కడప పరిసర ప్రాం తాల్లోని అడవిలోకి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, రైళ్ల ద్వారా వచ్చా రు. ఈ మార్గాల్లోనూ అధికారులు పర్యవేక్షణ పెంచారు. దీంతో తిరువన్నామలై జిల్లా జావాదిమలై ప్రాంతంలోని తమిళ కూలీలు బెంగళూరు నుంచి అనంతపురం, కమలాపురం నుంచి ఖాజీపేట పరిసర ప్రాంతంలోని అటవీ ప్రాంతంలోకి ప్రవేశించారు. పోలీసు అధికారులు గండివాటర్స్, కడప నగర శివార్ల ప్రాంతంలో వారిని పట్టుకున్నారు. తర్వాత జావాదిమలై ప్రాంతం నుంచి ఎర్రచందనం స్మగ్లర్ల సహకారంతో తమిళ కూలీలు నేరుగా బెంగుళూరు ప్రాంతానికి చేరుకుంటున్నారు. అక్కడి నుంచి కడప, రాయచోటి, వేంపల్లి రేంజ్‌ల పరిధిల మధ్య భాగంలో వున్న అటవీ ప్రాంతానికి వెళ్తున్నారు. వారితో పాటు స్మగ్లర్లు కిట్ బ్యాగ్‌లు, బియ్యం, కూరగాయలు, వంటసామగ్రి, కర్ణాటక రాష్ట్రానికి చెందిన ‘మెక్ డోవెల్స్ బ్రాందీ ‘ టెట్రా ప్యాకెట్స్, వాటర్ బాటిల్స్‌ను తమ వెంట తెచ్చుకుంటున్నారు. పేరు మోసిన ఎర్రచందనం స్మగ్లర్లు తమ భరోసాతో తమిళ కూలీలను ప్రైవేట్, ఇతర వాహనాల ద్వారా పైన చెప్పిన అటవీ ప్రాంతాలకు దగ్గరగా వదిలివెళుతున్నారు. వీరు తమ వెంట తెచ్చుకున్న కిట్లను సునాయాసంగా మోసుకుని వెళుతూ, ఎర్రచందనంను సులభంగా నరికి, దుంగలుగా తయారు చేస్తున్నారు. అప్పటికే నరికి వుంచిన 99 ఎర్రచందనం దుంగలను తమిళ కూలీలు తొట్ల నరవ ప్రాంతంలో అక్కడక్కడా దాచి వుంచా రు. వీటి బరువు సుమారు 2.5 టన్నులు, విలువ రూ. 2.5 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అటవీ అధికారులు, సిబ్బందిని చూసి.. దాదాపు 80 మంది తమిళ కూలీలు రాళ్లు, గొడ్డళ్లతో దాడులు చేస్తూనే పరారయ్యారు. వారి వెంట తెచ్చుకున్న కొంత వంట సామగ్రితోపాటు, ఒక గొడ్డలి, బ్రాందీ ఖాళీ టెట్రా ప్యాకెట్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# అక్కరకు రాని ఎత్తిపోతల పథకం

రాజమండ్రి, జూన్ 18, (న్యూస్ పల్స్)దాదాపు దశాబ్దిన్నర క్రితం గోదావరి జిల్లాల్లో చేపట్టిన సాగునీటి ఎత్తిపోతల పథకాల్లో అత్యధికం ఇంకా అక్కరకురాలేదు. రెండు ప్రభుత్వాలు, నలుగురు ముఖ్యమంత్రులు మారినా, నేటికీ ఆయా పథకాల ఆయకట్టు లక్ష్యానికి దూరంగానేవుంది. అంచనాల పెంపునకు తగినవిధంగా ఈ పథకాలు లక్ష్యానికి చేరలేదు. వైఎస్ హయాంలో మొదలైన ప్రాజెక్టులు కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలోకి వచ్చిన తర్వాత అంచనాలు పెరిగాయి, ఆపై వచ్చిన టీడీపీ ప్రభుత్వం హయంలో అంచనాలు పెరిగినా నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు దక్కలేదు.పశ్చిమ గోదావరి జిల్లా తాడిపూడి ఎత్తిపోతల పథకంలో 14 మండలాల్లోని 127 గ్రామాలకు చెందిన 5.4 లక్షల జనాభాకు తాగునీరు, 2లక్షల 6వేల 600 ఎకరాల ఆయకట్టుకు 12.5 టీఎంసీల నీటిని సరఫరాచేయడానికి ఈ పథకాన్ని ఉద్దేశించారు. 2003 మార్చి 27న రూ.295.08 కోట్లకు పరిపాలన ఆమోదం లభించిన ఈ పథకాన్ని 2009లో సవరించిన అంచనాల ప్రకారం మొత్తం రూ.467.80 కోట్లతో చేపట్టారు. ఇంకా పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించడం అనుమానంగానేవుంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు వద్ద అఖండ గోదావరి ఎడమ గట్టుపై కాటన్ బ్యారేజికి ఎగువన నిర్మించిన వెంకటనగరం ఎత్తిపోతల పథకం ఇంకా ఉత్తిపోతల పథకంగానేవుంది. 4250 ఎకరాల పాత ఆయకట్టుకు అనుబంధంగా 34 వేల ఎకరాలకు నిర్దేశిస్తూ 3.62 టీఎంసీల గోదావరి నీటిని తోడుకునే విధంగా 2008 మార్చి 5న రూ.124.18 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం ఆమోదించింది. ఈ పథకాన్ని 2014లోనే పూర్తిచేయాల్సివుంది. నేటికీ పూర్తికాలేదు. ఆయకట్టు కాగితాలకే పరిమితమై అతీగతీ లేకుండావుంది. జలయజ్ఞంలో భాగంగా పూర్తిగా గిరిజన రైతుల కోసం ముసురుమిల్లి, భూపతిపాలెం రిజర్వాయర్ పథకాలు చేపట్టారు. ఇందులో ముసురుమిల్లి రిజర్వాయర్ ద్వారా 22వేల 643 ఎకరాల ఆయకట్టు కోసం ఈ పథకాన్ని రూపకల్పన చేశారు. 2.534 టీఎంసీల జలాలను వినియోగించుకునేలా 2004 సంవత్సరంలో రూ.207 కోట్లతో చేపట్టారు. అనంతరం 2006లో జీవో నెంబర్ 1142 ప్రకారం రూ.11.65 కోట్లుతో కలిపి రూ.218.65 కోట్లతో పనులుచేశారు. ఆ తర్వాత సవరించిన అంచనాలతో రూ.236.78 కోట్లతో ఈ పథకం 2015కి పూర్తి చేయాల్సిందిగా నిర్దేశించారు.ఇప్పటికీ పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాలేదు. ఆయకట్టు కూడా అయోమయంగావుంది. భూపతిపాలెం రిజర్వాయర్ ప్రాజెక్టును 14వేల 28 ఎకరాల కోసం రూపొందించారు. 1.151 శతకోటి ఘనటడుగుల నీటిని వినియోగించుకుని గిరిజన రైతులకు సాగునీరు అందించడానికి ఈ పథకాన్ని రూపకల్పనచేశారు. 2007లో జీవో నెంబర్ 218 ప్రకారం రూ.187.91 కోట్ల అంచనాతో పరిపాలన ఆమోదం ఇచ్చారు. ఈ పథకాన్ని 2012 జూలై 14న అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అప్పట్లో మిగిలిన పనులకు రూ.20 కోట్లు కూడా మంజూరయ్యాయి. పూర్తి ఆయకట్టు దక్కలేదు. గిరిజన పొలాలకు సాగునీరు అందడం లేదు. డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ పూర్తిగా ఏర్పడలేదు. జలయజ్ఞ పథకాలకు సంబంధం లేకుండా గతంలో ఎపుడో నిర్మించిన చాగల్నాడు ఎత్తిపోతల పథకం కూడా నిర్దేశిత లక్ష్యం మేరకు నేటికీ ఆయకట్టు దక్కలేదు. 35వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి రూపొందించారు. 1999లో జీవో నెంబర్ 20 ప్రకారం రూ.61.23 కోట్లతో చేపట్టారు.

2002లో ఆ ప్రాజెక్టు రూ.70.77 కోట్లతో పూర్తిచేశారు. నేటికీ పూర్తిస్థాయిలో ఆయకట్టు దక్కలేదు. సూరంపాలెం రిజర్వాయరు ప్రాజెక్టును 14వేల 150 ఎకరాలకు సాగునీరు అందించడానికి రూపొందించి, అనంతరం ఆయకట్టును కుదించారు. బురద కాల్వపై ఈ ప్రాజెక్టు నిర్మించడానికి జీవో నెంబర్ 163 ప్రకారం 2004లో పరిపాలనా ఆమోదం ఇచ్చి రూ.51.38 కోట్లు కేటాయించారు. ఆ తర్వాత రూ.69.74 కోట్లతో పూర్తిచేశారు. ఈ పథకం ద్వారా 730 మిలియన్ ఘనపు అడుగుల నీటిని వినియోగించుకునేలా రూపొందించారు. ఈ మొత్తం ఎత్తిపోతల పథకాలకు సంబంధించి నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయకట్టు దక్కని వైనంపై ప్రస్తుత ప్రభుత్వం పరిశీలన చేపట్టినట్టు తెలుస్తోంది.

## ఆస్తిపన్ను పెంపుదల వెంటనే ఉపసంహరించాలి

**- జనసేన పార్టీ డిమాండ్**

అనంతపురం జూన్ 18, (న్యూస్ పల్స్)గత 16 నెలల నుంచి రాష్ట్ర ప్రజలు కరోనాతో ఎటువంటి ఆర్థిక వనరులు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపై,చెత్తపై పన్నులు పెంచడం చాలా దారుణమైన విషయం, దీనివలన బాడుగలు పెరిగి అవి కట్టలేక ఆర్థికంగా ఇబ్బంది పడతారని అనంతపురం జిల్లా కదిరి జనసేన పార్టీ ఇంచార్జ్ భైరవ ప్రసాద్ తెలియజేశారు . ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వమే ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో పన్నులను పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం మంచి పద్ధతి కాదని తెలియజేశారు .రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆస్తిపన్ను పెంపుదలను నిలిపివేయాలని లేనిపక్షంలో ప్రభుత్వానికి ప్రజల నుంచి వ్యతిరేకత, ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

# టీడీపీ ధర్నా

సింగనమల జూన్ 18, (న్యూస్ పల్స్) అనంతపురం జిల్లా సింగనమల లో తెలుగుదేశం పార్టీ నేతలు ధర్నాకు దిగారు. రాష్ట్రంలో కోవిడ్ తో మరణించిన కుటుంబాలకు 10 లక్షలు ఆర్థిక సహాయం, ప్రతి వైట్ రేషన్ కార్డు ఉన్న కుటుంబానికి పదివేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. పన్నులు తగ్గించాలని నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శాలిని కన్వీనర్ గుత్తా ఆదినారాయణ జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి మాజీ మండల కన్వీనర్ చిదంబర దొర, మాసుల చంద్రమోహన్, మాజీ మార్కెట్ యార్డ్ రహంతుల్లా అనిల్ భాష అక్బర నిధున వాడ పెద్దన్న ఎమ్ పి టి సి కుర రాముడు వలి పెరవలి ప్రభాకర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి నిదాన వాడా ఎంపిటిసి అభ్యర్థులు శోధన పల్లి నరసింహులు లో లూరు నారాయణస్వామి సింగనమల గ్రామ కమిటీ అధ్యక్షుడు శంకర్ నారాయణ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతి అయిన ధాన్యం రాశులు

నెల్లూరు జూన్ 18, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం పాలిచర్లవారిపా ళెం లో రైతుల ధాన్యం ప్రమాదవశాత్తు కాలి బుడిదైన ఘటన చోటుచేసు కుంది. గ్రామం లోని ముగ్గురు రైతులు గ్రామ సమీపంలో పక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లో పక్కపక్కగా రైతులు ధాన్యం రాశులుగా పోసి ఉంచారు. పక్కనే నరికి వేసి ఉన్న జామాయిల్ తోటకు నిప్పు అంటుకోవడంతో ఆ మంటలు దాన్యపు రాశులకు అంటుకున్నాయి. రూ.2.88 లక్షల విలువ జేసే 49 పుట్ల ధాన్యం రాశులు అగ్నికి ఆహుతి అయ్యాయి. మంటలు చెలరేగాడంతో రైతులు ఆందోళన చెందారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే సగానికి పైగా ధాన్యం కాలి బూడిదయింది. కళ్ళ ముందే పండిన పంట అగ్నికి ఆహుతి అవడం తో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉపాధి హామి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఏపి వ్యవసాయ కార్మిక సంఘం**

నెల్లూరు జాతీయ గ్రామీణా ఉపాధి హామి పథకాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అద్యక్షులు దమ్ము దర్గాబాబు పేర్కొన్నారు. ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆద్వర్యంలో జలదంకి మండలం కమ్మవారిపాలెంలో, ఉపాధి కు?లీలు పని చేసే ప్రాంతాన్ని పరిశీలించటం జరిగింది .ఈ సందర్భంగా దర్గా బాబు మాట్లాడుతూ వామపక్షా పార్టీల సహకారంతో, యు?పిఏ ప్రభుత్వం 25 ఆగష్టు 2005 భారత రాజ్యాంగ ద్వార ఉపాధి హామి పథకం కనీస వేతన చట్టం తీసుకు రావడం జరిగిందన్నారు. ఉపాధి హామి పథకం ప్రతి ఆర్థిక సంవత్సరం, దారిద్ర్య రేఖ దిగువనున్న నైపుణ్యం లేని కొద్దిపాటి నైపుణ్యం గల వయె?జనులందకి, ప్రతి గ్రామీణా కుటుంబంలో పని కోరిన వారికి, గ్రామ పరిదిలో 100 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. కరోనా విపత్కర పరిస్థితిలో గ్రామీణా ప్రాంత వ్యవసాయ కు?లీలు ఉపాధి కోల్పోయిరన్నారు అని, వారికి ప్రభుత్వం ఉపాధి హామి పథకం గ్రామీణ ప్రాంత ప్రజలకు కల్పిస్తుందన్నారు. ఉపాధి హామి పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సు?చించారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాకు 20 కోట్లు కేటాయిస్తుందని ,కాని మౌళిక సౌకర్యాలు కల్పించలేదన్నారు. ఉపాధి కు?లీలకు వేసవి అలవేన్స్ మార్చిలో ను?టికి 20% ఏప్రిల్ 30 % ఆదనంగా ఇవ్వాలన్నారు .ప్రతి గ్రు?ప్ కి 4 గడ్డపారలు ఇవ్వాలి అని కోరారు. 4 సంవత్సరాల నుండి ఇవ్వటం ఆరోపించారు. గత సంవత్సరం ఉపాధి కు?లీల పెండింగ్ బిల్లులు వేంటనే చెల్లించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉపాధి రోజు వారి వేతనం 300 నుండి 390 పెంచిదన్నారు. ఆదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాది కు?లీల వేతనం పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేశారు .

# ఎన్డీయేయే గూటికి జగన్ పార్టీ..?

విజయవాడ, జూన్ 18, (న్యూస్ పల్స్)వైఎస్ జగన్మోహనరెడ్డి బేషరతుగానే ఎన్డీయేలోకి వెళ్తారా? ఆయన ముందు నుంచి చెబుతూ వస్తున్న ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులతో పాటు ఏపీకి విభజన హామీలకు ఏ రకమైన భరోసా లేకుండానే చేరిపోతారా? అంటే ఢిల్లీలో వేగంగా మారుతున్న పరిణామాలు అవును అనే అంటున్నాయి. జగన్ మీద ఈ మేరకు తీవ్ర వత్తిడి ఉందని అంటున్నారు. ఇక్కడ విషయం ఏమిటంటే జగన్ కి కూడా ఎన్డీయేలోకి వెళ్ళేందుకు ఇష్టమే. కానీ కొన్ని హామీలు అయినా కేంద్రం నెరవేర్చితే అపుడు చేరినా జనాలకు జవాబు చెప్పుకోవచ్చు అన్నదే ఆయన ఆలోచనట.జగన్ గతంలోలా గట్టిగా నిలబడడానికి పరిస్థితులు ఏ మాత్రం అనుకూలంగా లేవు. కరోనా రెండు సార్లు వచ్చిన తరువాత ఏపీ ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బ తింది. అంతే కాదు. గడచిన రెండేళ్లలో చేసేందుకు అప్పులు అయినా దొరికాయి. ఇక ముందు ఆ పరిస్థితి కూడా ఉండదు, దాంతో రానున్న మూడేళ్ళూ గడ్డు కాలంగానే ఉంది. మరో వైపు చూసుకుంటే సీబీఐ కేసులు తోసుకువస్తున్నాయి. జగన్ ఎడంగా బయట ఉండడం వల్ల కేంద్రం కూడా ఆయన విషయంలో ఏ మేలూ చేయలేకపోతోంది. దాంతో జగన్ రాజకీయంగా కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.ఇక జగన్ కేంద్రంలో చేరితే చాలా విషయల్లో బిగ్ రిలీఫ్ ఉంటుందని అంటున్నారు. ముఖ్యంగా మూడు రాజధానుల విషయంలో జగన్ కోరుకున్నట్లుగా కథ సాఫీగా ముందుకు సాగిపోతుంది. అలాగే సీబీఐ కేసుల విషయంలో కొంత తలనొప్పి తగ్గే చాన్స్ ఉంటుంది. ఇక రెబెల్ ఎంపీ రఘురామ క్రిష్ణం రాజు లాంటి వారు మరింతమంది పార్టీలో లేవకుండా ఉంటారు. రఘురామ నోటికి కూడా అర్జంటుగా తాళం పడుతుంది. అదే సమయంలో కేంద్రం నేరుగా నిధులు ఇవ్వకపోయినా అప్పులు తెచ్చుకునే విధంగా అయినా మార్గాలు చూపిస్తుంది. దాంతో మిగిలిన మూడేళ్ల కాలం కొంత ఇబ్బంది లేకుండా గడిపేయవచ్చు.మోడీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తరువాత మంత్రి వర్గ విస్తరణ చేస్తున్నారు. చాలా ఖాళీలను భర్తీ చేయడంతో పాటు, కొత్త ముఖాలను కూడా తీసుకుంటారు. ఇక ఇదే లాస్ట్ విస్తరణ అని కూడా ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఇపుడు కనుక జగన్ నో అంటే కచ్చితంగా ఎన్డీయేతో దూరం పెరిగిపోతుంది.

వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం టచ్ మీ నాట్ అంటూ బీజేపీతో వ్యవహరిస్తే ఈ మూడేళ్ల కాలమే అసలు కదిలే సీన్ ఉండదు, ఇక జగన్ ఎస్ అంటే మాత్రం రెండు మంత్రి పదవులతో పాటు చాలా సమస్యలు తీరిపోతాయి. ఏపీలో విపక్షం నోరెత్తకుండా ఉంటుంది. ఒక విధంగా జగన్ ఇపుడు అతి పెద్ద పరీక్షను ఎదుర్కొంటున్నారు. ఎన్డీయేలో చేరితే వైసీపీ సిద్ధాంతాలు గాలికి కొట్టుకుపోతాయి. బీజేపీ వ్యతిరేకతతో తానూ మునగాల్సి వస్తుంది. అలాగని చేరకపోతే ఈ రోజు నుంచే ఎదురీదాలి. ఆ పర్యవసానాలు ఎలా ఉంటాయో కూడా తెలియదు. మొత్తానికి జగన్ తీసుకున్నే ఏ నిర్ణయం అయినా సంచలనమే అవుతుంది అంటున్నారు.

# ప్రజలను సురక్షిత మైన ప్రాంతాలకు తరలించేలా ముందస్తు కార్యాచరణ

**జాయింట్ కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి**

ఏలూరు జూన్ 18, (న్యూస్ పల్స్) పోలవరం ప్రాజెక్ట్ ముంపు ప్రాంతాల్లో రానున్న వరద ప్రవాహాన్ని అంచనావేసి, ప్రజలను సురక్షిత మైన ప్రాంతాలకు తరలించేలా ముందస్తు కార్యాచరణ తో సిద్ధంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి స్పష్టం చేశారు.శుక్రవారం పోలవరం ప్రాజెక్ట్ విడిది సమావేశ మందిరంలో ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పోలీసు, రెవెన్యూ, వైద్య, అగ్నిమాపక, ఐసిడిఎస్, ఆర్ డబ్ల్యు ఎస్, విద్యుత్, తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కె. వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్ట్ ముంపు ప్రాంతాల్లో ప్రజలను తరలింపు, తదుపరి చర్యలపై ఆయా శాఖలు నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సిద్ధంగా ఉండాలన్నారు. 2019, 2020 సంవత్సరాల లో చేపట్టిన పనులను పునః సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణ ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం ముంపు గ్రామాలలో వరద ఉధృతి అంచనా వేసి, వాటికి అదనంగా మరో ఆరు మీటర్లు ప్లస్ రెండు మీటర్లు ప్రవాహం వస్తే ఎదుర్కొనేలా అంచనా వేసి, చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ని 19 గ్రామాలు ముంపునకు గురి అయ్యే అవకాశాలు ఉన్నాయని, అక్కడ వారిని సురక్షితంగా తరలించేందుకు పూర్తి నిర్దిష్టమైన కార్యాచరణ ఉండాలన్నారు. అందులో ప్రతి ఒక్క శాఖ స్థానికంగా ఉండే అధికారుల, సిబ్బంది తో సమన్వయం చేసుకుంటూ, ఎక్కడికక్కడే చర్యలు చేపట్టాలన్నారు. ఏ ఒక్క శాఖ నిర్లక్ష్యంగా వ్యవరించవద్దని స్పష్టం చేశారు.స్పిల్వే గేట్ ల నిర్మాణం పూర్తి చేసుకుని, వరద నీటి ప్రవాహం స్థితి గతులు అంచనా వేయాలన్నారు. గతంలో అప్పర్ కాపర్ డాం గ్యాప్ లనుంచి నీటి ప్రవాహం మళ్లించేవారమన్నారు. ప్రస్తుతం పరిస్థితికి అనుగుణంగా ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో ఎన్ని లక్షలు క్యూసెక్కులు నీటి పారుదల ఉంటే ఏఏ గ్రామాలు ముంపు అవుతాయో ఇరిగేషన్ శాఖ అంచనా వేసి, ఆరు మీటర్లు అదనంగా నివేదిక రూపొందించినట్లు అధికారులు జేసి కి వివరించారు. అందుకు అదనంగా మరో రెండు మీటర్లు ఎత్తు వరకు మనం క్షేత్రస్థాయిలో సంసిద్ధత తో ఉండాలని జేసి సూచించారు.ముంపుకు గురైయ్యే గ్రామాలకు కావాల్సిన నిత్యావసర సరుకుల, మెడికల్, శానిటేషన్ తదితర వివరాలకు అనుగుణంగా స్టాకును తరలించాలని జేసి ఆదేశించారు. ముంపు గ్రామాల ప్రజలను సురక్షితంగా తరలించే చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో బోట్స్ కూడా నిర్ణిత ప్రదేశాల్లో సిద్ధం చేసుకోవాలన్నారు. గత ఏడాది పోలీస్, రెవిన్యూ , ఇరిగేషన్ అధికారులు సమర్థవంతంగా పనిచేశారని జాయింట్ కలెక్టర్ తెలిపారు. గర్భిణీ స్త్రీలు, మహిళలు, వృద్ధులు, పిల్లల సంరక్షణ చర్యలతో మెడికల్ డిపార్ట్మెంట్ వారు అవసరమైన మందులు, ఐసీడీఎస్ అధికారులు పౌష్టికాహారం వంటి వారిని అంచనా వెయ్యలని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు నిత్యావసర సరుకుల అంచనాకు ముందు రావాల్సి వుంటుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పశుగణన మేరకు పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్.ఇ. పోలవరం కె. నరసింహమూర్తి, ఆర్డీఓ జేఆర్ గూడెం, పిఓ ఐటీడీ (ఇంచార్జ) వై వి లక్ష్మీ ప్రసన్న,ఎస్ ఈ ఇరిగేషన్ ఎంఎస్ఎస్ రవిబాబు,ఎస్ ఈ ఆర్ డబ్ల్యూఎస్ వి.రామస్వామి, ఇఇ ఆర్ అండ్ బి బి.రాము, ఇఇ ట్రైబల్ వెల్ఫేర్ డివిఆర్ఎం రాజు, డీఎస్ ఓ ఎన్. సుబ్బరాజు, డీపీఓ కె. రమేష్ బాబు, ఐ సి డి ఎస్ పీడీ విజయ కుమారి, డిఎం హెచ్ ఓ డా. సునంద, ట్రాన్స్ కో ఎస్ ఈ డి. రాజేంద్రప్రసాద్, హోసింగ్ ఈఈ బి. తారచంద్ , ఎంపిడిఓ సీహెచ్ శ్రీనివాసరావు, సిఐ ఏ. నరసింహ మూర్తి, తహసీల్దార్ లు, ఎంపిడిఓ లు తదితరులు పాల్గొన్నారు. ఆయా శాఖల అధికారులు రూపొందించిన ప్రణాళికను సమావేశంలో అధికారులు వివరించారు.

# 10 రోజులకు 500 కోట్లు దోచేస్తున్నారు.......

**ఎమ్మెల్యేలు, మంత్రులు అండదండలతో రెచ్చిపోతున్నారు....**

**జిల్లా కలెక్టర్ స్పందించకుంటే హైకోర్టులో తేల్చుకుంటాం....**


**టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్**

నెల్లూరు ఇసుక మాఫియా పై టిడిపి నేత అబ్దుల్ అజీజ్... జిల్లా కలెక్టరేట్లో మరోమారు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నెల్లూరు జిల్లాలో అనేక రీచ్ లకు సంబంధించి అధికార పార్టీ అండదండలతో పెద్ద హస్తాలు ఉండడంతో స్వయంగా ఆయనే రంగంలోకి దిగారు. నెల్లూరు రూరల్ పరిధిలోని గొల్ల కందుకూరు ఇసుక ఇసుక మాఫియా నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు జరిపారని కేవలం పది రోజుల్లోనే 500 కోట్లు దోచేశారని అబ్దుల్ అజీజ్ ధ్వజమెత్తారు. జిల్లా కలెక్టర్ చక్రధర బాబు తో భేటీ అయ్యి గొల్ల కందుకూరు ఇసుక రీచ్ లో అక్రమాలను వివరించారు.అనంతరం నెల్లూరు జిల్లా కలెక్టరేట్లో మీడియాతో మాట్లాడారు.. కేవలం ఒక ఇసుక రీచ్ లోనే ఇంత అవినీత జరుగుతుంటే ఇంకా రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని కోట్ల అవినీతి జరుగుతుందో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు వారి అండదండలతో ఇసుక మాఫియా యదేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు... జిల్లా కలెక్టర్ చక్రధర బాబు ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపి చర్యలు తీసుకోకుంటే దీనిపై హై కోర్టులో తేల్చుకుంటామని హెచ్చరించారు.. అలాగే పెద్ద ఎత్తున పోరాటం కూడా తప్పదన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

## తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ఆర్థిక శాఖ మంత్రి

తిరుపతి, ,జూన్ 18 జిల్లాలో రెండురోజుల పర్యటన ముగించుకుని , తిరుమల శ్రీవారిని దర్శించుకుని రాష్ట్ర ఆర్థిక , ప్రణాళిక, శాసన సభ వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం ఉదయం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనార్థం ఆలయం వద్దకు చేరుకున్న మంత్రి కుటుంబ సభ్యులకు డెప్యూటీ ఇ.ఓ కస్తూరి బాయి , సూపరింటెండెంట్ మల్లీశ్వరి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## జనసేనాని ఆచితూచి అడుగులు



కాకినాడ, జూన్ 18, (న్యూస్ పల్స్)జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు వచ్చే ఎన్నికలు ప్రతిష్టాత్మకం. గత ఎన్నికల మిగిల్చిన చేదు అనుభవాలను ఆయన ఇంకా మరిచిపోలేకపోతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా పార్టీని విజయపథం వైపు నడపాలన్నది పవన్ కల్యాణ్ ఆలోచనగా ఉంది. జగన్ ను ఓడించడమే పవన్ కల్యాణ్ లక్ష్యం. అందుకే ఈసారి ఎన్నికల్లో అన్ని రకాల అస్త్రశస్త్రాలతో దిగాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. తమకు పట్టున్న ప్రాంతాల్లోనే పోటీ చేయాలని నిర్ణయించారు.దీంతో పాటు ప్రధానంగా జగన్ ను ఓడించాలంటే టీడీపీతో పొత్తు పెట్టుకోవడమే ముఖ్యం. టీడీపీతో జత కడితేనే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉంటుంది. అందుకే పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తుకు రెడీ అయిపోతున్నారు. అదే సమయంలో బీజేపీని ఒప్పించే బాధ్యతను కూడా పవన్ కల్యాణ్ తన భుజస్కందాలపై వేసుకున్నట్లు తెలిసింది. ఏపీలో బీజేపీ మిత్రపక్షం అధికారంలోకి రావాలంటే టీడీపీని కలుపుకుని వెళ్లాలన్న డిమాండ్ ను పార్టీ పెద్దల ముందు పవన్ కల్యాణ్ పెట్టే అవకాశముంది.గత ఎన్నికల మాదిరి ఈసారి ఓట్ల చీలికకు పవన్ కల్యాణ్ ఇష్టపడటంలేదు. ప్రధానంగా తనకు అనుకూలంగా ఉన్న కాపు సామాజికవర్గం నుంచి పూర్తి స్థాయి మద్దతు లభిస్తుంది. అయితే బీజేపీతో మాత్రమే కలసి పోట ?చేస్తే అది సత్ఫలితాలనివ్వదు. వైసీపీకి అడ్వాంటేజీగా మారే అవకాశముంది. అందుకే పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తుకు సముఖత వ్యక్తం చేస్తున్నారు. బీజేపీని కూడా ఒప్పించేం?దుకు సిద్ధపడుతున్నారు.గత ఎన్నికల్లో పోటీ చేసి కేవలం ఒకే స్థానాన్ని జనసేన గెలుచుకుంది. పవన్ కల్యాణ్ పోటీ చేసిన రెండుచోట్ల ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఈసారి పొత్తులతో వెళ్లి తక్కువ స్థానాల్లో పోటీ చేసి ఎక్కువ విజయాలను సాధించాలన్నది పవన్ కల్యాణ? ఆలోచనగా ఉంది. రోజురోజుకూ బీజేపీ పై పెరుగుతున్న వ్యతిరేకత కూడా పవన్ కల్యాణ్ ఆలోచనలో మార్పునకు కారణమంటున్నారు. బీజేపీ అవునన్నా, కాదన్నా పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తుకు సిద్ధమయిపోతున్నారన్న టాక్ పార్టీలో బలంగా వినపడుతుంది.

# టీడీపీ నేతల వినతిపత్రం

విశాఖపట్నంజూన్ 18, (న్యూస్ పల్స్) మాజీ మంత్రి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు విశాఖ జిల్లా నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ అధికారికి వినతి పత్రం అందించారు. తెల్ల రేషన్ కార్డు దారులందరికీ 10 వేల రూపాయలు ఆర్థిక సాయం, కరోనా మృతుల కుటుంబాలకు 10 లక్షలు ఆర్థికసాయాన్ని అందించాలని వినతి పత్రంలో అధికారులను కోరారు.వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసి బకాయిలను వెంటనే చెల్లించాలని,ఆంధ్రప్రదేశ్లో ప్రజారోగ్యం ప్రమాదంలో పడిందని వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం కరోనా కోరల్లో చిక్కుకుందని పట్నం, పల్లె అనే తేడా లేకుండా వైరస్ చుట్టేసిందని చెప్పారు. ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు సరిగా లేని కారణంగా వేలాదిమంది మరణించారని కరోనా కట్టడికి వ్యాక్సినే ఏకైక మార్గమని తెలిసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గందరగోళం నెలకొందని వాపోయారు.మొదటి డోసు కోసం లక్షలాది మంది నిరీక్షిస్తు న్నారని మొదటి డోసు వేసుకున్న వారికి సమయానికి రెండో డోసు దొరకని పరిస్థితి నెలకొందని అన్నారు.

## పెట్రోల్, డీజిల్ ,గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

**సీపీఎం సీపీఐ, న్యూ డెమోక్రసీ డిమాండ్**

కౌతాళం జూన్ 18, (న్యూస్ పల్స్) కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలను ఈ నెల 18 రోజుల్లోనే 11 సార్లు పెంచిందని, అలాగే గ్యాస్ ధరలు మే 2 తర్వాత రెండుసార్లు పెంచిందని, వంట నూనె మరియు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి ధరలు తగ్గించాలని కోరుతూ వామపక్షాల పిలుపుమేరకు కౌతాళం మండల కేంద్రంలో సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహం దగ్గర ట్రాక్టర్, ఆటో, స్కూటర్ ను తాడుతో లాగి నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు మల్లయ్య, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి లింగన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల నాయకులు జగదీష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపడం పనిగా పెట్టుకుందని వారు విమర్శించారు. కరొన కష్టకాలంలో బ్రతకడమే కష్టంగా ఉంటే ధరలు పెంచడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.. అసలు ధర కన్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేసే పన్నులు అధికంగా ఉన్నాయని వారన్నారు. వామపక్షాల పిలుపు మేరకు దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కౌతాళం లో నిరసన కార్యక్రమాన్ని చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ కార్యకర్తలు వీరేష్, రామలింగా, మహబూబ్, వెంకన్న, ఈరన్న, రామంజి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కార్యకర్తలు మల్లి, గోపాల్, ఖాదర్ కూలీలు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

నంద్యాలజూన్ 18, (న్యూస్ పల్స్) నంద్యాల యమ్ యల్ ఏ శిల్ప రవి చంద్ర కిషోర్ రెడ్డి శుక్రవారం నాడు సుడిగాలి పర్యటన చేశారు.22 వార్డు కు సంబంధించిన రైతు నగరం లో 45 లక్షల రూపాయల తో సీసి రోడ్డు మరియు డ్రైనేజీ పనులను ప్రారంభించారు. అలాగే బిల్లలాపురం గ్రామంలో గ్రామ సచివాలయం కు భూమి పూజ చేశారు. మరియు పులిమద్ది గ్రామంలో 40 లక్షల రూపాయల తో నిర్మించిన గ్రామ సచివాలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ. మున్సిపల్ చైర్ పర్సన్ మా బున్నిసా. వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర రెడ్డి. బిల్లలాపురం వైయస్ ఆర్ పార్టీ నాయకుడు మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ మాజీ చైర్మన్ శివరాం. వైయస్ అర్ సీ పీ పార్టీ నాయకులు కార్యకర్తలు . తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి

## వామపక్షాలు

డోన్ జూన్ 18, (న్యూస్ పల్స్) పెట్రోల్, డీజల్,నిత్యావసర వస్తువులు, మందుల పై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని వామపక్షాలు డిమాండ్ చేసారు, స్థానిక డోన్ పట్టణంలో వామపక్షాలఆధ్వర్యంలో ఈ నెల 18 న దేశ వ్యాప్తంగా నిరసనలు, ధర్నాలు వామపక్షాలు నిర్ణయించారు, అందులో భాగంగానే ఈ నుంచి 30వ తేది వ వరకు పెంచిన ధరలపై ధర్నాను చేపట్టారు,ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత నెలలో రసరాలలో 5 రాష్ట్రాల్లో అనంతరం ఒక్క మే నెలలోనే ఇప్పటి వరకు 21 సార్లు పెంచడం జరిగింది, ఇలా పెంచుకుంటూ పోతేఎంతవరకు సమంజసం అనీ ఆయన తెలిపారు,నిత్యావసర వస్తువులు, మందుల ధరలు పెంచుతూ పోతుంటే సామాన్యులపై భారం పడి నానా అవస్థలు పడుతున్నారు, ఇక మన రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించకుంటే పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి, మొన్న ముఖ్య మంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటన వెళ్ళి ఆయన కేసుల గురించే తప్ప, ఇతర విషయలు కాదని, అన్నారు, ఇలాగానే నిత్యావసర వస్తువుల ధరలపై, మందుల పైన పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు, సీపీఎం నాయకులు శివరాం మాట్లాడుతూ ఆస్తి పన్ను,ఇంటి పన్నులపై పెంచిన జెల్‌జీఓ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు, సీపీఐ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ తో జగన్మోహన్ రెడ్డి లాలూచీ పడి ఆయన కేసులు మాఫీ చేయాలని అమిథ్ షా తో సమావేశం పరిచారుఅని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు హసీనా, ప్రభాకర్, పులి శేఖర్,అబ్బాస్,సీపీఎం నాయకులు లక్ష్మణ,ఏఐటీయూసీ లక్ష్మినారాయణ, ఆటో యూనియన్ నాయకులు అన్వర్, గౌడ్, నూర్ బాషా, నాగరాజు, బాలు, సురన్న,తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 20న కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రత్యేక డ్రైవ్ ను సమన్వయం తో పని చేసి విజయవంతం చేయండి

చిత్తూరు, జూన్ 18 రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20 న ఆదివారం వ్యాక్సినేషన్ ప్రత్యేక డ్రైవ్ ను జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్ తెలిపారు. శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్ లు (అభివృద్ధి, సంక్షేమం) వి.వీరబ్రహ్మం, ఎన్. రాజశేఖర్, డి ఎం అండ్ హెచ్ ఓ డా. శ్రీహరి, డి పి ఓ దశరథ రామి రెడ్డి, జెడ్ పి సి ఇ ఓ ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ లు, తహశీల్దార్లు, ఎం పి డి ఓ లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20 ఆదివారం వ్యాక్సినేషన్ ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించడం జరుగుతున్నదని,ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా ఒక లక్ష డోసుల వ్యాక్సి నేషన్ వేయడమే లక్ష్యం గా పనిచేయాలని తెలిపారు. వ్యాక్సినేషన్ లో భాగంగా అర్హులైన 45 సం. ల పైబడిన వారికి 0-5 వయసు గల పిల్లలు గల తల్లులకు వ్యాక్సినేషన్ వేయడం పై మండల మరియు మున్సిపల్ టాస్క్ ఫోర్స్ బృందాలు ప్రత్యేక దృష్టి సారించి వ్యాక్సినేషన్ చేయాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో అర్హులుగా ఉండి ఇంకనూ వ్యాక్సినేషన్ వేయించుకోని వారి జాబితాను సిద్ధం చేయాలని, ఈ జాబితా ప్రకారం ఆదివారం వీరందరూ వ్యాక్సినేషన్ చేయించుకునేలా వాలంటీర్లు,

**ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా ఒక లక్ష డోసుల వ్యాక్సి నేషన్ వేయడమే లక్ష్యం**

**ప్రత్యేక డ్రైవ్ లో కోవిషీల్డ్, కొవ్యాక్సిన్ మొదటి, రెండవ డోసూలు వేయడం జరుగుతుంది**

**45 సం.ల పైబడిన వారికి, 0-5 వయసు గల పిల్లల గల తల్లులకు వ్యాక్సినేషన్ చేయడం పై దృష్టి సారించండి**

**- : జిల్లా కలెక్టర్**

ఆశా, అంగన్వాడీ కార్యకర్త మరియు ఏఎన్ఎం లు క్షేత్ర స్థాయిలో మరింత భాద్యతాయుతంగా పని చేసేలా మండల, మున్సిపల్ టాస్క్ ఫోర్స్ బృందాలు పని చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని అన్ని పి హెచ్ సి లలో, సచివాలయాల పరిధిలో వ్యాక్సినేషన్ చేయడం జరుగుతుందని, ఈ అంశం పై ప్రజలకు మరింత అవగాహన కలిగేలా క్షేత్ర స్థాయిలో గల అధికారులు మరియు మండల మున్సిపల్ స్థాయిలో గల అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహణకు సంబంధించి తగు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకుని అమలు చేయాలని తెలిపారు.

# క్లోరినేషన్ తో అంటువ్యాధులకు అడ్డుకట్ట...

## డాక్టర్ ప్రవీణ్ కుమార్

తుగ్గలిజూన్ 18 క్లోరినేషన్ కార్యక్రమం ద్వారా అంటువ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని తుగ్గలి ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలియజేశారు.శుక్రవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలో గ్రామ సర్పంచ్ రామాంజనేయులు,హెల్త్ సూపర్వైజర్లు,ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రజలు వినియోగించే వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాలలో క్లోరినేషన్ చేశారు. క్లోరినేషన్ చేసిన ప్రాంతాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలను తెలియజేశారు.ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ క్లోరినేషన్ కార్యక్రమం ద్వారా గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చని ఆయన తెలియజేశారు.వర్షాకాలం సమీపిస్తుండడంతో ప్రజలు తాగు నీటి విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలియజేశారు.వేడి చేసి వడపోసిన నీటిని మాత్రమే వినియోగించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆయన తెలియజేశారు.ఎప్పటికప్పుడు త్రాగు నీటి ట్యాంకులను శుభ్రపరిచి,క్లోరినేషన్ చేయడం ద్వారా గ్రామాలలో ఎటువంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటాయని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నాగమ్మ ,ఏఎన్ఎం దానమ్మ ,ఆశా వర్కర్లు షకీనాబీ,ఆనందమ్మ ,నాగమణి,ఎస్తేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కరోనా సమయంలో వర్షాకాలంలో గర్భిణీ స్త్రీల రక్షణ కోసం ఏమి చేయాలో మీకు తెలుసా?



వర్షాకాలం ప్రారంభమైంది. ఈ సీజన్ చాలా మందికి ఇష్టమైనప్పటికీ, ఈ కాలంలో సంభవించే అసౌకర్యాలు చాలా ఎక్కువ. ఇతరులకన్నా ఎక్కువగా గర్భవతి అయిన మహిళలు ఈ కాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఇతర సీజన్లలో కంటే ఈ కాలంలో వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువ. గర్భిణీ స్త్రీలు ఈ కాలంలో వారి రోగనిరోధక శక్తి బలహీనపడటంతో వైరస్ బారిన పడే అవకాశం ఉంది. ఇది తీవ్రమైన రక్తస్రావం మరియు గర్భస్రావం వంటి ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీస్తుంది. వర్షాకాలంలో గర్భవతి అయిన మహిళలు సురక్షితంగా ఉండటానికి ఏమి చేయాలో ఈ పోస్ట్‌లో మీరు తెలుసుకోవచ్చు. డీహైడ్రేషన్ డీహైడ్రేషన్ వర్షాకాలంలో డీహైడ్రేషన్ విషయంలో జాగ్రత్త తీసుకోవడం చాలా ముఖ్యం. ఉష్ణోగ్రత తగ్గడం వల్ల ఎక్కువ ద్రవాలు తాగాలనే మీ కోరిక తగ్గుతుంది, కాని తేమను నిలుపుకోవటానికి తగిన ఆర్ద్రీకరణను నిర్వహించడం చాలా అవసరం. ఇది డీహైడ్రేషన్ వల్ల తలనొప్పి, అలసటను తొలగిస్తుంది. కాచి, చల్లార్చిన నీరు పుష్కలంగా త్రాగాలి. అదనంగా, మీరు రసం, జ్యూస్, చీజ్ వంటి నీటి ఉత్పత్తులను తీసుకోవచ్చు. అలాంటోళ్లు మాత్రమే శృంగారాన్ని ఎక్కువగా ఆస్వాదిస్తున్నారట...!అలాంటోళ్లు మాత్రమే శృంగారాన్ని ఎక్కువగా ఆస్వాదిస్తున్నారట...! ఆహారం ఆహారం రుచికరమైన ఆహారాన్ని కోరుకోవడం గర్భధారణ సమయంలో సాధారణం. కానీ గర్భధారణ సమయంలో నివారించాల్సిన ఆహారాలు చాలా ఉన్నాయి. ఆకుపచ్చ కూరగాయలు, ఎక్కువ గుడ్లు మరియు చేపల ఆహారాలు తినకుండా ఉండటం మంచిది. రోడ్డు పక్కన ఉన్న ఆహారాన్ని పూర్తిగా మానుకోవాలి. పాలకూర, క్యాబేజీ వంటి ఆకు కూరలలో చాలా కలుషితాలు ఉంటాయి. కాబట్టి వంట చేసే ముందు వాటిని బాగా కడగాలి. ఆరోగ్యంగా ఉండటానికి ఫైబర్ మరియు ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని తినండి. ఏదైనా ఆహారం తినడానికి ముందు, దాని ఆరోగ్య ప్రయోజనాలు మరియు పోషక విలువల, నష్టాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఈ లక్షణాలను బట్టి మీ బంధం ఎలా ఉంటుందో తెలుసుకోవచ్చు...!ఈ లక్షణాలను బట్టి మీ బంధం ఎలా ఉంటుందో తెలుసుకోవచ్చు...! దోమల ముప్పు దోమల ముప్పు వర్షాకాలం మలేరియా మరియు డెంగ్యూ వ్యాప్తి చెందే దోమల పెంపకానికి ఇది సహాయపడుతుంది కాబట్టి మీ ఇల్లు మరియు తోటలో నిశ్చలమైన నీటిని నివారించండి. దోమల తిప్పికొట్టడానికి, నియంత్రించడానికి దోమతెరలు మరియు వికర్షకాలను ఉపయోగించండి. మీ ఇంటి కిటికీలు మరియు తలుపులు ఎక్కువగా మూసివేయబడ్డాయని నిర్ధారించుకోండి. పాత్రలు రుద్దే సోప్ తో ఈ వస్తువులను మరియు ప్రదేశాలను శుభ్రం చేయవచ్చన్న విషయం మీకు తెలుసా?పాత్రలు రుద్దే సోప్ తో ఈ వస్తువులను మరియు ప్రదేశాలను శుభ్రం చేయవచ్చన్న విషయం మీకు తెలుసా? బట్టలు బట్టలు వదులుగా ఉన్న స్లీవ్ కాటన్ దుస్తులు దోమల నుండి రక్షణను అందిస్తుంది మరియు దోమకాటను నివారించడానికి సహాయపడుతుంది. సింథటిక్ ఫైబర్స్ మరియు టైట్ దుస్తులు ధరించడం మానుకోండి ఎందుకంటే అవి అసౌకర్యం మరియు సోరియాసిస్ కలిగిస్తాయి. షూస్ షూస్ ఆహ్లాదకరమైన వాతావరణం మిమ్మల్ని బయట ఆహ్వానిస్తుంది. కాబట్టి సురక్షితంగా ఉండటానికి ఫ్లాట్ బూట్లు లేదా చపల్స్ ధరించండి. జారే మరియు పాదాలకు నొప్పి కలిగించే చెప్పులు ధరించకపోవడమే మంచిది. హై హీల్స్ ధరించడం మానుకోండి. ఆరోగ్యం ఆరోగ్యం చేతి పరిశుభ్రత మరియు శుభ్రమైన తాగునీరు హెపటైటిస్ ఎ, ఇ మరియు టైఫాయిడ్ వంటి నీటి ద్వారా వచ్చే వ్యాధులను నివారించవచ్చు. వాటిలో కొన్ని గర్భిణీ స్త్రీలకు ప్రమాదకరం. ప్రతి భోజనానికి ముందు, రోజుకు చాలాసార్లు చేతులు కడుక్కోవడం, మరియు టాయిలెట్ ఉపయోగించిన తర్వాత నీటితో చేతులు కడగడం మంచి పరిశుభ్రతను కాపాడుకోవడానికి సహాయపడుతుంది. జెర్మ్స్ తొలగించడానికి స్నానం జెర్మ్స్ తొలగించడానికి స్నానం రోజుకు ఒకసారి, క్రిమిసంహారక మందుతో స్నానం చేయండి. ఇది మీ శరీరంలో ఎక్కువసేపు ఉండే జెర్మ్స్ మరియు ఇన్ఫెక్షన్ల అవకాశాలను తగ్గిస్తుంది. వేడి నీటిలో మిస్టేల్టోయ్ ఉంచడం మరియు కొన్ని చుక్కల క్రిమినాశక మందులను కలపడం వలన మీరు శుభ్రంగా మరియు ఆరోగ్యంగా ఉంటారు.

# డబ్ల్యూటీసీ ఫైనల్లో టీమిండియా గెలుపుపై గంగూలీ.. ఏం చెప్పాడంటే..?

ముంబై : మరికొన్ని గంటల్లో డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ జరుగడానికి ముందు బీసీసీఐ అధ్యక్షుడు, టీమిండియా మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ కొన్ని సూచనలు చేశారు. తన సూచనలను పాటిస్తే టీమిండియా గెలుపు సాధ్యమని నొక్కిచెప్పారు. టాస్ గెలియిన తర్వాత టీమిండియా తొలుత బ్యాటింగ్ తీసుకోవాలని, గిల్, రోహిత్ జట్టుకు మంచి ఆరంభం ఇవ్వడం ద్వారా భారత్‌కు విజయం సాధ్యమని చెప్పారు. అలాగే, అశ్విన్ కొత్త రికార్డు నెలకొల్పడం కూడా సాధ్యమేనన్నారు.టాస్ గెలిచిన తర్వాత టీమిండియా మొదట బ్యాటింగ్ చేయడం చాలా మంచిదని, ఎందుకంటే చాలా రోజుల తర్వాత విదేశీ పర్యటనల్లో పాల్గొనడం వల్ల జట్టు ఆటపై మరింత ఆసక్తిని కలిగి ఉంటుందని అన్నారు. గత రికార్డులను పరిశీలిస్తే, విదేశాల్లో మొదట బ్యాటింగ్ చేయడం ద్వారా మనం చాలా మ్యాచ్‌లను గెలిచామని తెలుస్తుందని గంగూలీ చెప్పారు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లోనే కాకుండా ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌లో కూడా రోహిత్, గిల్ జట్టుకు మంచి ఆరంభం ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ చేతేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లీ, రిషభ్‌పంత్ ఇబ్బంది పడకుండా ఉండటానికి వీరిద్దరూ కనీసం 20 ఓవర్లు బ్యాటింగ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కొత్త రికార్డుకు చేరువలో ఉన్న అశ్విన్ ఈ మ్యాచ్‌లో ఆ రికార్డును తన పేరిట రాసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రౌడీ బేబీ కోసం.. ఎదురు చూస్తున్న బాలీవుడ్!



సాయి పల్లవి టాలెంట్ గురించి స్పెషల్ గా ఇంట్రుడ్యూస్ చేయాల్సిన పనిలేదు. ఈ నేచురల్ బ్యూటీ నటనకు అన్ని ఇండస్ట్రీల ప్రేక్షకులూ ఫిదా అవుతున్నారు. ఇక ఈ బ్యూటీ పాదం కదిపితే ఆ లెక్కే వేరు. సహజంగానే డ్యాన్సర్ అయిన సాయి పల్లవి.. సినిమాల్లో వేసే స్టెప్పులకు ఫ్యాన్స్ ఈల వేసి గోల చేస్తుంటారు. తన సహజమైన నటనతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుందీ బ్యూటీ.అయితే.. ఈ అమ్మడు డబ్బే ప్రధానంగా సినిమాలు చేసే రకం కాదు. తన క్యారెక్టర్ నచ్చాలి. సమ్ థింగ్ డిఫరెంట్ అనిపిస్తే తప్ప.. సినిమాకు సైన్ చేయదు. ఆ విధంగా ఇప్పటి వరకు ఎన్నో చిత్రాలు వదిలేసుకుంది. అందులో స్టార్ హీరోల సినిమాలు కూడా ఉన్నాయి. ఆ విధంగా.. సెలక్టివ్ సినిమాలను ఎంచుకునే సాయిపల్లవి.. మెజారిటీగా హిట్లనే తన ఖాతాలో వేసుకుంటోంది.ఇప్పుడు లేటెస్ట్ న్యూస్ ఏమంటే.. సాయి పల్లవి టాలెంట్ బాలీవుడ్ ను సైతం ఆకర్షించింది. అక్కడి నుంచి చాలా సినిమా ఆఫర్లు వస్తున్నాయట. లేటెస్ట్ గా ఓ ప్రముఖ బ్యానర్ కూడా ఈ బ్యూటీని కాంటాక్ట్ అయ్యిందని టాక్. బాలీవుడ్ కు వెళ్లడానికి ఈ అమ్మడు కూడా సిద్ధంగానే ఉందని తెలుస్తోంది. అయితే.. ఖచ్చితంగా కథ మాత్రం నచ్చాల్సిందే. అన్నీ ఒకే అయితే.. త్వరలోనే ఈ కేరళ కుట్టి బాలీవుడ్ లో అడుగు పెట్టడం ఖాయమేనట.కాగా.. టాలీవుడ్ లో సాయిపల్లవి నటించిన రెండు చిత్రాలు బ్యాక్ టూ బ్యాక్ రిలీజ్ కానున్నాయి. అందులో నాగచైతన్యతో కలిసి నటించిన 'లవ్ స్టోరీ' ఒకటికాగా.. రానాతో నటించిన విప్లవ చిత్రం విరాట పర్వం రెండోది. ప్రస్తుతానికి ఈ రెండు చిత్రాలపైనా పాజిటివ్ ఎక్స్ పెక్టేషన్సే ఉన్నాయి.

# సినిమాల విడుదల విషయంలో టాలీవుడ్ కు ఎదురయ్యే సవాళ్లు..!




కరోనా వైరస్ సెకండ్ వేవ్ ప్రభావం నుంచి టాలీవుడ్ నెమ్మదిగా బయటకు వస్తోంది. కేసులు తగ్గుముఖం పట్టి లాక్ డౌన్ నిబంధనలు సడలించడంతో ఇప్పటికే 'మ్యాస్ట్రో' వంటి కొన్ని సినిమా షూటింగులు తిరిగి ప్రారంభమయ్యాయి. జూన్ నెలాఖరు నుంచి 'ఆర్.ఆర్.ఆర్' 'ఆచార్య' 'రాధే శ్యామ్' 'పుష్ప' వంటి పాన్ ఇండియా సినిమాలు కూడా సెట్స్ పైకి వెళ్ళడానికి సన్నాహాలు చేసుకుంటున్నాయి. వీటితో పాటుగా 'శాకుంతలం' 'థాంక్యూ' 'ఖిలాడి' 'ఎఫ్ 3' 'పక్కా కమర్షియల్' 'అఖండ' 'కార్తికేయ 2' వంటి సినిమాలు కూడా స్టార్ట్ కానున్నాయి. ఇకపోతే జూలై రెండో వారం నుంచి తెలంగాణ రాష్ట్రంలో థియేటర్లు రీ ఓపెన్ అవుతాయని ప్రచారం జరుగుతోంది. 50 శాతం సీటింగ్ సామర్థ్యంతో అనుమతి ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందని అంటున్నారు. అయినప్పటికీ సినిమాల విడుదల విషయంలో నిర్మాతలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని చూస్తున్నారు. ఏపీ - తెలంగాణ రాష్ట్రాల్లో లాక్ డౌన్ నిబంధనలు సడలించినా ప్రస్తుతం నైట్ కర్ఫ్యూ కొనసాగుతోంది. అంటే థియేటర్లు తెరుచుకున్నా నైట్ షోలకు అవకాశం ఉండదు. అందుకే రాత్రిపూట కర్ఫ్యూ పూర్తిగా తొలగించిన తర్వాతే సినిమా విడుదలల గురించి ఆలోచించాలని భావిస్తున్నారట. నైట్ కర్ఫ్యూ ఎత్తివేసిన వారం తర్వాత 'లవ్ స్టోరీ' సినిమాని విడుదల చేయాలని అనుకుంటున్నామని నిర్మాతలు ప్రకటించారు. అయితే ఆంధ్రప్రదేశ్ లో సినిమా టికెట్ ధరలు సవరించడం కూడా మేకర్స్ కు ఆందోళన కలిగిస్తోందట. టికెట్ ధరలు పునఃపరిశీలించిన తర్వాత థియేటర్స్ తెరవాలని పలువురు ఎగ్జిబిటర్లు అభిప్రాయ పడుతున్నారట. అందుకే టాలీవుడ్ ప్రముఖులు త్వరలోనే ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డితో ఈ విషయంపై చర్చించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారట. ఏదేమైనా సినిమాల విడుదల విషయంలో తొందరపడకుండా ముందుచూపుతో వ్యవహరించాలని నిర్ణయానికి వస్తున్నట్లు అర్థం అవుతోంది.

# మీ రూపమే కాదు.. మనసూ అందమైందే – హీరోయిన్ పై ప్రశంసలు



దేశంలో కరోనా మహమ్మారి ఎంత మందిని పొట్టన పెట్టుకుందో.. ఎంతటి విధ్వంసం సృష్టించిందో అందరికీ తెలిసిందే. ధనవంతులకు పెద్దగా ఇబ్బందులు ఎదురు కాలేదుగానీ.. నిరుపేదలు సర్వం కోల్పోయారు. అలాంటి వారిని మానవతా వాదులు ప్రేమమూర్తులు ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. తమ వంతు సహకారం అందించారు. అలాంటి వారిలో సినిమా హీరోయిన్ ప్రణీత కూడా ఉన్నారు.కొవిడ్ మొదటి దశ మొదలైన దగ్గర్నుంచి పలు మార్లు పలు విధాలుగా ఆమె సహాయం అందించారు. గతేడాది లాక్ డౌన్ సమయంలోనూ తనవంతుగా కొవిడ్ బాధితులకు సహకారం అందించారు ప్రణీత. చాలా మందికి ఆహారం సరఫరా చేశారు. సెకండ్ వేవ్ లో ఆహారం కన్నా.. ఆక్సీజన్ ఎక్కువ అవసరమైందని తన చారిటీ ద్వారా ఆక్సీజన్ సిలిండర్లు కాన్సన్ట్రేటర్లు అందించారు.ఇప్పుడు మరో విధంగా సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. కొవిడ్ ను ఎదుర్కోవడంలో వ్యాక్సిన్ ఎంతో కీలకం అన్న సంగతి తెలిసిందే. కానీ.. దేశంలో చాలా మంది వ్యాక్సిన్ అందక నానా అవస్థలు పడుతున్నారు. అలాంటి వారికి వ్యాక్సిన్ అందిస్తున్నారు ప్రణీత.ఇవాళ బెంగళూరులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత వ్యాక్సిన్ అందుబాటులో ఉందని ఈ మేరకు తన ఫౌండేషన్ ద్వారా ఏర్పాట్లు చేశామని ప్రణీత వెల్లడించారు. అస్టర్ అనే ఆసుపత్రిలో ఉచితంగా వ్యాక్సిన్ తీసుకోవొచ్చని సమీపంలో ఉన్నవారు వెళ్లి తీసుకోవాలని సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.దీంతో.. నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. మీది అందమైన రూపమే కాదు.. అంతకు మించి అందమైన మనసు కూడా.. అంటూ అభినందిస్తున్నారు.

# పడుచు మనసులు దోచిన అంజలికి పట్టుదల ఎక్కువే!

ఏ సినిమాకైనా కథనే ప్రధానం .. కథ బాగున్నప్పుడు ఆ హీరో క్రేజ్ ఆ సినిమాకి హెల్ప్ అవుతుంది. అలాగే హీరోయిన్ గ్లామర్ అదనపు ఆకర్షణ అవుతుంది. కథాకథనాలు .. హీరోల సంగతి అటుంచితే హీరోయిన్ చాలా గ్లామరస్ గా ఉండాలి .. తన ఆకర్షణీయమైన రూపంతో కుర్రాళ్లను మంత్రముగ్ధులను చేయాలి. థియేటర్ కి వచ్చిన తరువాత ఆమె అభినయం ఎలా ఉందన్నది చూస్తారు. కానీ వాళ్లను థియేటర్ వరకూ తీసుకొచ్చేది ఆమె



గ్లామరే.అయితే తెలుగు తెరపై మొదటి నుంచి కూడా గ్లామర్ పరంగా మార్కులు కొట్టేసేది ముంబై ముద్దుగుమ్మలు .. కేరళ కొబ్బరి ముక్కలాంటి అమ్మాయిలు. ఈ కారణంగా వాళ్ల హవానే చాలా కాలంగా సాగుతూ వస్తోంది. అలాంటి పరిస్థితుల్లో తెలుగు అమ్మాయిలను పట్టించుకునే అవకాశం ఉండేది కాదు. అందువల్లనే అంజలి రచ్చ గెలిచి ఇంట గెలవాలనే ఉద్దేశంతో ముందుగా తమిళ సినిమాలపై దృష్టిపెట్టింది. అక్కడి అనువాదాల ద్వారా తెలుగులో అవకాశాలు అందుకుని ఇక్కడ అడుగుపెట్టింది.ఎలాంటి పాత్రలోనైనా అంజలి అవలీలగా ఒదిగిపోతుంది. చాలా సహజంగా ఆ పాత్రలో ఇమిడిపోతుంది. అందువల్లనే చాలా తక్కువ సమయంలో చాలా ఎక్కువ క్రేజ్ ను సొంతం చేసుకుంది. యువ కథానాయకులతో పాటు సీనియర్ స్టార్ హీరోలతో సైతం నటించి మెప్పించింది. అంతేకాదు లేడీ ఓరియెంటెడ్ కథలను చేస్తూ వెళ్లింది. అలాంటి అంజలి ప్రస్తుతం తెలుగు .. తమిళ భాషల్లో కొత్త హీరోయిన్ల నుంచి గట్టిపోటీని ఎదుర్కుంటోంది. ఎలాగైనా పోటీని తట్టుకోవాలనే తపనతో సన్నబడింది. అవకాశాలను అందుకోవడానికి తనవంతు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. తాను అనుకున్న స్థాయికి చేరుకోవాలనే ఆశిద్దాం.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**